# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 21-4-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 193 పేజీలు:6 వెల: రూ.1/-


## టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 20: రాష్ట్రంలోని బీఎడ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు నేటితో ముగిసింది. అయితే అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు దరఖాస్తుల గడువును ఏప్రిల్ 25వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని, తమకు దగ్గర్లో ఉన్న పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

జనరల్, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 30వ తేదీన దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 5వ తేదీ నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎడ్‌సెట్‌ను మే 18న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహిస్తారు. ఎడ్‌సెట్‌ను గతంలో ఉస్మానియా వర్సిటీ నిర్వహించింది. ఈ ఏడాది నల్లగొండలోని మహాత్మాగాంధీ వర్సిటీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

## గంగిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై మంగళవారానికి హైకోర్టు వాయిదా

హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏ1గా ఉన్న ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఎర్రగంగిరెడ్డి బెయిల్ పిటిషన్ రద్దు కోరుతూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగగా సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని హైకోర్టులో సీబీఐ వాదించింది. వివేకా హత్యకు కుట్ర చేసింది గంగిరెడ్డే అని.. వివేకను హత్య చేసింది గంగిరెడ్డే అని తెలిపింది. సీబీఐ దర్యాప్తుకు ముందు సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడం వల్లే గంగిరెడ్డి బెయిల్ పొందాడని కోర్టుకు సీబీఐ తెలియజేసింది. వివేకా హత్య కేసులో దర్యాప్తు కీలక దశలో ఉందని.. సుప్రీంకోర్టు పరిశీలన మేరకు ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌కు అర్హుడే కాదని సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు.అయితే.. అన్ని అంశాలను పరిశీలించే గంగిరెడ్డి బెయిల్ రద్దుకు ఏపీ హైకోర్టు గతంలో నిరాకరించిందని ఎర్రగంగిరెడ్డి తరపు సీనియర్ లాయర్ శేషాద్రి నాయుడు తెలిపారు. వివేకా హత్యకేసుపై ప్రభావం చూపుతాడని, సాక్షులను బెదిరిస్తాడని ఊహించి గంగిరెడ్డి బెయిల్ రద్దు చెయ్యొద్దని అన్నారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది.కాగా.. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డి అలియాస్ తుమ్మలపల్లి గంగిరెడ్డి. వివేకా హత్య కేసులో గంగిరెడ్డిని ఏపీ పోలీసులు 2019 మార్చి 28న అరెస్టు చేశారు. ఆ తర్వాత 90 రోజులు గడచినా చార్జిషీట్ దాఖలు చేయకపోవడంతో అదే ఏడాది జూన్ 27న గంగిరెడ్డికి డీఫాల్ట్ బెయిల్ వచ్చింది. ఏపీ పోలీసుల దర్యాప్తు ఆశించిన స్థాయిలో లేదని.. కేసును సీబీఐకి ఇవ్వాలని వివేకా కుమార్తె ఏపీ హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సీబీఐకి అప్పగించింది. తదనంతరం గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని సీబీఐ కోరగా... కోర్టు ఆ పిటిషన్ కొట్టివేసింది. దీంతో సీబీఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. తీవ్ర నేరారోపణలు ఉన్న కేసుల్లో స్పష్టమైన ఆధారాలు ఉంటే డీఫాల్ట్ బెయిల్‌ను రద్దు చేయొచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. సీబీఐ పిటిషన్‌పై మెరిట్ ఆధారంగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలంటూ కేసును మళ్లీ ఏపీ హైకోర్టుకు రిమాండ్ చేసింది. తదనంతర పరిణామాల్లో వివేకా హత్య కేసు దర్యాప్తు తెలంగాణకు బదిలీ అయింది. ఈ క్రమంలోనే ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు నుంచి ఏపీ హైకోర్టుకు.. అక్కడి నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయింది. తాజాగా గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరుగగా.. సీబీఐ వాదనలు వినిపించింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి హైకోర్టు వాయిదా వేసింది.

## నిమ్స్ విస్తరణ పనులకు వచ్చే నెలలో సీఎం కేసీఆర్ శంకుస్థాపన : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 20:నిమ్స్ దవాఖాన విస్తరణ పనులకు సీఎం కేసీఆర్ వచ్చే నెలలో శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కొత్తగా 2,000 పడకలతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందించే లక్ష్యంతో విస్తరణ పనులను చేపడుతున్నామని చెప్పారు. హైదరాబాద్ నాంపల్లిలోని ఏరియా హాస్పిటల్‌లో డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బ్యాంక్‌ను గురువారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నగరం నలువైపులా గచ్చిబౌలి, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్‌లో నిర్మించనున్న టిమ్స్ దవాఖానల పనులను వేగవంతం చేస్తామన్నారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలకు పేదల ఆరోగ్యం పట్టలేదని మండిపడ్డారు. బ్రిటిష్ కాలంలో, నిజాం కాలంలో ఏర్పాటు చేసిన గాంధీ, ఉస్మానియా, నిమ్స్ తప్ప ఏడు దశాబ్దాల పాలనలో ఒక్క సూపర్ స్పెషాలిటీ దవాఖాన కట్టలేదని మండిపడ్డారు. కానీ.. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించేందుకు కొత్తగా నాలుగు టిమ్స్ (4 వేల పడకలు) నిర్మిస్తున్నారని, నిమ్స్ దవాఖాన విస్తరణ (2 వేల పడకలు) చేపట్టారని తెలిపారు. తద్వారా ఏకంగా ఆరువేల పడకలు అదనంగా అందుబాటులోకి రానున్నట్టు వెల్లడించారు. దీంతోపాటు వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న హెల్త్ సిటీ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. అత్యవసర సమయాల్లో ఉత్తమ వైద్యం అందించేందుకు ట్రామా కేర్ సెంటర్లను బలోపేతం చేయనున్నట్టు మంత్రి తెలిపారు. లెవల్ 1, 2, 3గా వర్గీకరించి అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్పొరేట్ తరహాలో అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రెండు వారాల్లో న్యూట్రిషన్ కిట్ ప్రారంభం

గర్భిణులు, పుట్టబోయే పిల్లల ఆరోగ్యం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ను ఒకటి రెండు వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

మొత్తం 6.5 లక్షల మంది గర్భిణులకు ప్రయోజనం కలుగనున్నట్టు చెప్పారు. ఇందుకోసం బడ్జెట్లో సీఎం కేసీఆర్ రూ.250 కోట్లు కేటాయించారని చెప్పారు. ఇప్పటికే లక్ష కిట్లు జిల్లాలకు పంపించామని, మరో లక్ష కిట్లు సేకరిస్తున్నామని వెల్లడించారు. అవి రాగానే పంపిణీని ప్రారంభిస్తామని హరీశ్‌రావు ప్రకటించారు.

## అధిక ఉష్ణోగ్రతలు హీట్ స్ట్రోక్

హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ) అధిక ఉష్ణోగ్రతలు హీట్ స్ట్రోక్ డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాషన్, హీట్ క్రాంప్స్ వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీయొచ్చు.అధిక వేడి యొక్క దుష్ప్రభావాలను నివారించడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలను అనుసరించడం చాలా కీలకం.

### వడదెబ్బ నివారించేందుకు చిట్కాలు

వడదెబ్బ అనేది అధిక ఉష్ణోగ్రతలు ఎక్కువ కాలం బహిర్గతం కావడం వల్ల కలిగే తీవ్రమైన అనారోగ్య పరిస్థితి. భారతదేశంలో చాలామంది వేసవి కాలంలో వడదెబ్బ గురై మరణిస్తారు. వడదెబ్బకు తక్షణ చికిత్స అవసరం, లేకుంటే మూత్రపిండాలు, కండరాలు, మెదడు, గుండె త్వరగా దెబ్బతింటుంది.

### వడదెబ్బ లక్షణాలు:

- శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటుంది
- గందరగోళం, అస్పష్టమైన మాటలు, చిరాకు
- చెమట లేకుండా ఎరుపెక్కి, పొడిబారిన చర్మం
- వేగవంతమైన శ్వాస, వాంతులు, వికారం
- గుండె వేగంగా, ఎక్కువసార్లు కొట్టుకోవడం
- తలనొప్పి,శరీర తిమ్మిరి
- వడదెబ్బను ఎలా నివారించాలి:
- వడదెబ్బకు గురైన సమయంలో ఎక్కువగా ద్రవాలు తీసుకోవాలి. మండే ఎండలో తిరిగి ఇంటికి వచ్చినప్పుడు పుష్కలంగా నీరు తాగాలి. కొబ్బరినీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, తాజా ఉండే రసాలు తీసుకోవాలి.
- అధిక ఉష్ణోగ్రతలలో వ్యాయామం చేయడం మానుకోండి
- చల్లటి నీటితో స్నానం చేయండి
- లేత రంగు, వదులుగా, సౌకర్యవంతమైన బట్టలు ధరించండి
- ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు బయటకి వెళ్లకుండా ఉండాలి
- ఆల్కహాల్ తీసుకోవడం మానుకోవాలి. ఎందుకంటే ఇది శరీరంలో ఎక్కువగా వేడిని ఉత్పత్తి చేస్తుంది.
- వేసవి కాలంలో ఆరోగ్యంగా ఉండేందుకు ఇతర చిట్కాలు:
- బాగా హైడ్రేటెడ్‌గా ఉండండి
- వేసవి కాలంలో దొరికే నీటిశాతం ఎక్కువగా ఉన్న పండ్లు, ఆహార పదార్థాలు తీసుకోవాలి.
- సన్‌స్క్రీన్ ధరించండి, తేలికైన, పల్చటి దుస్తులను ధరించండి
- మీ శరీర ఉష్ణోగ్రతను పెంచే చర్యలను నివారించండి
- మీ ఆహారంలో శరీర శీతలకరణిగా పనిచేసే ఆహారాలను జోడించండి

## పండగ వాతావరణంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు : మంత్రి తలసాని



హైదరాబాద్, ఏప్రిల్ 20:బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో హోం మంత్రి మహమూద్ అలీ, జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్‌తో కలిసి హైదరాబాద్ జిల్లా ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఉత్సాహంగా సాగుతున్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో అనేక నియోజకవర్గాల్లో డివిజన్ స్థాయి సమ్మేళనాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

మిగతా డివిజన్లలో 24లోగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 25న నిర్వహించే నియోజకవర్గ సమ్మేళనాలకు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఎన్నికల్లో పోటీ చేసిన వారిని, పార్టీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నేతలను ఆహ్వానించాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో పార్టీ పతాకాలను ఆవిష్కరించి సమావేశం వద్దకు రావాలని చెప్పారు. సమ్మేళనాల సందర్భంగా జెండాలు, తోరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలన్నారు. సమావేశం నిర్వహణకు సంబంధించి సమగ్రమైన ఎజెండాను సిద్ధం చేసుకోవాలన్నారు.

ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేసేలా ప్రగతి నివేదికను రూపొందించి ఆత్మీయ సమ్మేళనంలో వివరించాలన్నారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్ రావు, సురభి వాణిదేవి, స్టీఫెన్ సన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేశ్, రావుల శ్రీధర్ రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఆనంద్ గౌడ్, నందు బిలాల్, ఆజాం, సలావుద్దీన్ లోది, రాంరెడ్డి, జీవన్ సింగ్, బక్రీ పాల్గొన్నారు.

## గుజరాత్ కాదు..తెలంగాణ మోడల్ దేశ వ్యాప్తం కావాలి : మంత్రి ఎర్రబెల్లి




వరంగల్, ఏప్రిల్ 20: దేశానికి కావల్సింది గుజరాత్ మోడల్ కాదని, తెలంగాణ మోడల్ కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అతి తక్కువ కాలంలోనే తెలంగాణ దేశంలో అన్ని రంగాల్లో ముందుండటమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండలంలో రెండు చోట్ల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు తిరుగులేదు. ప్రతిపక్షాలకు జనాదరణ లేదు. బి అర్ ఎస్ గెలుపునకు ఎదురు లేద' ని అన్నారు. ఇక ఇప్పుడు కావల్సింది దేశానికి సీఎం కేసీఆర్ మార్గదర్శనమని వెల్లడించారు. దేశం మొత్తం కేసీఆర్ కోసం ఎదురు చూస్తున్నదని అన్నారు. ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలపరచాలని, కేంద్రం, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనే ఉండాలని అప్పుడే రాష్ట్రం, దేశం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

అభివృద్ధి నిరోధకులకు అడ్డుకట్ట వేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అభివృద్ధి, సంక్షేమాలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్‌లాంటి ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేలా ప్రజలను సమాయత్తం చేయాలన్నారు.

సమైక్య పాలనలో నిరాదరణకు గురైన పల్లెలు నేడు అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సమృద్ధిగా సాగునీరు, 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయని తెలిపారు.

## ముస్లిం మహిళలలు, మున్సిపాలిటీ స్వీపర్స్ కొత్త బట్టలు పంపిణి




హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రంజాన్ పర్వదినం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని ఉప్పర్‌పల్లి రాజేంద్రనగర్‌లోని మున్సిపాలిటీ పరిదిలోని పలువురు ముస్లిం మహిళలలకు అలాగే స్వీపర్స్ ప్లేస్‌కు హెల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ కాకుమాను లౌర్దు జ్యోతి కొత్త బట్టలు అందజేశారు. అలాగే ఇరవై మంది ఇంటి పనివారికిఉ షారాణి, వినయ్, ప్రవీణ్, జగదీష్ ల చేతుల మీదుగా కొత్త బట్టలుఅందజేసారు.ఈ సందర్భంగా వారు లౌర్దు జ్యోతికి దీవెనలుఅందించారు.మీ హస్తం ఇందులో ఎదగాలని మరియు వీలైనంత ఎక్కువ మందికి సహాయం చేయాలని మేము కోరుకుంటున్నాము మీ సామర్థ్యంలో పేదవారికి సహాయం చేయాలని మేము కోరుకుంటున్నాము మీరు ఇప్పటివరకు మాకు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు.

## ఈ నెల 23 న అక్షయ తృతీయ

మెదక్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి):ఈ నెల 23 న అక్షయ తృతీయ సందర్భంగా మహాత్మా బసవేశ్వర జయంతి వేడుకలను కలెక్టరేట్ లో అధికారికంగా నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆదివారం ఉదయం పదిన్నర గంటలకు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామని, ఇట్టి కార్యక్రమంలో, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబంది అందరు పాల్గొని జయప్రదం చేయవలసినదిగా ఆయన కోరారు.

### నేటి కందం– నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ అతులితమగు బాధ్యతగల
పౌరులకే - యుతి కొలువెల్ల లిప్సిత మొప్పన్
చతురతతో జరుపగవలె
శ్రీ తెలిపో జాతీయ పౌర సేవల దినమున్!!



ఏప్రిల్ 21 జాతీయ పౌర సేవల దినోత్సవం

(National Civil Services Day)

–రాధశ్రీ

సెల్:9494481210

## పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు



హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి స్వర్గీయ నందమూరి తారకరామారావు శతజయంతోత్సవాలు పురస్కరించుకొని శ్రీ పాలకూర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చౌటుప్పల్ పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి గౌడ్ తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు లక్ష రూపాయల బహుమతుల తో పాటు జ్ఞాపికలు అమూల్యమైన పుస్తకాలు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 25వ తేదీ లోపు 984 8711 424 నంబర్ కు వాట్సాప్ ద్వారా తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఆ తర్వాత వచ్చిన పేర్లను తిరస్కరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. వాట్సాప్ లో విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్, ఫోన్ నెంబర్, పేరు, టైప్ చేసి పై వాట్సాప్ కు పంపగలరని కోరారు. రాత పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించబడును. ఎగ్జామ్ సెంటర్ మరియు తేదీలను పరీక్ష తేదీలను మూడు రోజుల ముందుగా తెలియజేయడం జరుగుతుంది. ఎగ్జామ్ మే మొదటి వారంలో నిర్వహించబడుతుంది ఈ పోటీల్లో పాల్గొనేవారు ఎలాంటి ఎంట్రీ ఫీజును చెల్లించిన అవసరం లేదు. బేసిక్ సిలబస్ మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు ఉంటుంది.






## వరంగల్ బస్టాండ్‌లో ఒకరి మృతి..




వరంగల్, ఏప్రిల్ 20: వరంగల్ బస్టాండ్ లో ప్రమాదవశాత్తు వెనుక టైరు కింద పడి ఒకరు మృతి చెందారు. మృతుడి తల పగిలి చనిపోయాడు. సంఘటన స్థలంలోని సీన్ చూస్తే బస్సు వ్యక్తి మీద నుండి పోయినట్టు లేదు. బస్సును వెనుకకు తీసే క్రమంలో ప్రయాణీకుడికి తగిలి కింద పడటం వల్ల తల పగిలి మృతి చెంది ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ గుర్తు తెలియని వ్యక్తి మృతితో ఆగ్రహోదకులైన ప్యాసింజర్స్ బస్టాండ్ లో నిలిచి ఉన్న బస్సులపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. ఐదారు ఆర్టీసీ బస్సుల అద్దాలు మిగిలిపోయాయి. వెనుక టైరు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రయాణీకులు ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీరును నిరశిస్తూ ఆందోళనకు దిగారు. ఆర్టీసీకి వ్యతిరేకంగా వరంగల్ బస్టాండ్ లో నినాదాలు చేస్తూ అర గంటకు పైగా హంగామా చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని చక్కదిద్దారు. ఘటనకు సంబంధించి అన్ని కోణంలో ఇంతేజార్ గంజ్ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## హైదరాబాద్‌లో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 20: ఈ నెల 21వ తేదీన హైదరాబాద్ నగరంలోని మక్కా మసీదు, సికింద్రాబాద్ పరిధిలోని జామియా మసీదు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు ప్రకటించారు.

జుమాత్ ఉల్ విద ప్రార్థనల నేపథ్యంలో ఈ రెండు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు.

చార్మినార్ – మదీనా, చార్మినార్ – ముర్గి చౌక్, చార్మినార్ – రాజేశ్ మెడికల్ హాల్, శాలిబండ మధ్య వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్లు తెలిపారు. నయాపూల్ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలన మదీనా జంక్షన్ నుంచి సిటీ కాలేజీ వైపునకు మళ్లిస్తారు. శాలిబండ నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను హిమ్మత్‌పురా జంక్షన్ వద్ద హరి బౌలి, వోల్గా హోటల్ టీ జంక్షన్ మీదుగా మళ్లించనున్నారు.

కోట్ల అలిజా నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను చౌక్ మైదాన్ ఖాన్ వద్ద హాఫీజ్ డంకా మసీదు, అమన్ హోటల్ వైపు మళ్లించనున్నారు. మూసాబౌలి నుంచి చార్మినార్ వచ్చే వాహనాలను మోతిగల్లి వద్ద ఖిల్వాత్ గ్రౌండ్, రాజేశ్ మెడికల్ హాల్, ఫతే మైదాన్ రోడ్డు మీదుగా మళ్లించనున్నారు.

### సికింద్రాబాద్ పరిధిలో..

సుభాష్ రోడ్, మహంకాళి పీఎస్, రామ్‌గోపాల్ పేట్ రోడ్ జంక్షన్ ఎంజీ రోడ్డును ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయనున్నారు. రోచా బజార్ నుంచి రాణిగంజ్ వైపు ట్రాఫిక్‌కు అనుమతిస్తారు. బాటా క్రాస్ రోడ్స్ నుంచి సుభాష్ రోడ్డు వైపు వచ్చే వాహనాలను మహంకాళి పీఎస్ వద్ద లాలా టెంపుల్ వైపు మళ్లిస్తారు.

# అత్యంత ప్రమాదకర రుగ్మతగా అధిక రక్తపోటు..!

ప్రపంచవ్యాప్తంగా 1.28 బిలియన్ల వయోజనులు (30 – 79 ఏళ్ల వయస్సు) అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్ లేదా బీపీ) రుగ్మతతో సతమతమవుతున్నారని, వీరిలో 67 శాతం (మూడింట రెండు వంతులు) మంది అల్ప, మధ్య ఆదాయ దేశాల ప్రజలు ఉన్నారని ఐరాస నివేదికలు తెలియజేస్తున్నాయి. దాదాపు 46 శాతం ప్రజలకు అధిక బీపీ ఉన్న విషయం కూడా తెలియని అమాయక స్థితిలో ఉన్నారనే ఆశ్చర్యకర వార్త కొంత కలవరాన్ని కలిగిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 42 శాతం మందికి అధిక బీపీ ఉన్నట్లు తమ తమ పరీక్షల్లో తేలిందని, వారు వైద్య సలహాలు తీసుకుంటున్నారని నివేదిక స్పష్టం చేసింది. ప్రతి ఐదుగురులో ఒక్కరికి బీపీ నియంత్రణలో ఉంటున్నదని, ఈ సమస్యతో అధిక జనులు అకాల మరణం పొందుతున్నారని తెలుస్తున్నది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 నాటికి బీపీ రుగ్మతను 33 శాతానికి తగ్గించాలని పథక రచన చేశారు. ఆరోగ్యకర వ్యక్తిలో రక్తపోటు 120/80 ఉండాలని, రక్తపోటు 140/90 లేదా అంతకన్నా అధికమైనపుడు బీపీ రుగ్మత ఉన్నట్లు నిర్ధారించి వైద్య సలహాలు, ఔషధాలు తీసుకుంటారు. సిస్టోలిక్ ప్రెషర్ 120-139, డయాస్టోలిక్ ప్రెషర్ 80-89 ఉన్నపుడు ప్రీ-హైపర్‌టెన్సివ్ స్థితిగా పేర్కొంటారు. అధిక బీపీ కలిగిన వ్యక్తులు సకాలంలో వైద్య సలహాలు, సూచనలు తీసుకోనపుడు ప్రాణాంతకం కూడా కావచ్చని గమనించాలి. అధిక బీపీ రుగ్మతతో బాధ పడుతున్న వారిలో ఎలాంటి లక్షణాలు కనిపించని కారణంగా తరుచుగా బీపీ చెకప్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

భారతంలో అధిక రక్తపోటు సమస్య:

భారతంలో 63 శాతం మరణాలు నాన్-కమ్యూనికెబుల్ వ్యాధుల(అంటువ్యాధి కానివి) కారణంగా జరుగుతున్నట్లు, ఇందులో 27 శాతం హృదయానా సంబంధ వ్యాధులతో మరణిస్తున్నట్లు ఐరాస తేల్చింది. 2025 నాటికి 25 శాతం బీపీ రుగ్మతను తగ్గించడానికి ఇండియా పలు చర్యలు చేపట్టడం జరిగింది. హైపర్‌టెన్షన్ బాధిత భారతీయుల్లో 12 శాతం మందికి మాత్రమే బీపీ అదుపులో ఉందని, బీపీని అలక్ష్యం చేస్తే హార్ట్ అటాక్, స్ట్రోక్ లాంటి హృదయానాళ సమస్యలు ఉత్పన్నం కావడం జరుగుతుందని ప్రచారం చేయాలి. ఇలాంటి కారణాలతో 33 శాతం మరణాలు నమోదు అవుతున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయి.

భారత బాలికల్లో పెరుగుతున్న బీపీ సమస్య:

భారతంలో 15-19 ఏండ్ల వయస్సు కలిగిన బాలికల్లో 2015-16 నుంచి 2019-21 వరకు బీపీ రుగ్మత సమస్య పెరిగినట్లు తేలింది. ముఖ్యంగా ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తరాఖండ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోఅధిక బీపీ కలిగిన బాలికల సంఖ్య పెరుగుతున్నట్లు గమనించారు. ఛత్తీస్‌ఘడ్‌లో 2015-16 వివరాల ప్రకారం నార్మల్ బీపీ కలిగిన బాలికలు 81.9 శాతం ఉండగా, 2019-21లో 67.1 శాతానికి తగ్గడం (14.8 శాతం తగ్గుదల) జరిగింది. ఇదే కాలంలో మహారాష్ట్రలో నార్మల్ బీపీ కలిగిన బాలికల సంఖ్య 13.3 శాతం తగ్గడం గమనించారు. దక్షిణ భారత రాష్ట్రాల్లో 78 శాతం బాలికలు నార్మల్ బీపీని కలిగి ఉండగా, భారతంలో (2015-16లో) 80 శాతం, 2019-21లో 74 శాతం నార్మల్ బీపీ కలిగి ఉన్నట్లు తేలింది.

అధిక బీపీ రుగ్మతకు ముఖ్య కారణాలు:

వయసు పైబడిన వృద్ధులు, జన్యుపరమైన కారణాలు, స్థూలకాయం లేదా అధిక శరీర బరువు, శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక ఉప్పును/షుగర్ వాడడం, అధిక ఆల్కహాల్ సేవనం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, అధిక కొవ్వు పదార్థాలను తీసుకోవడం, పొగ తాగడం లాంటి పలు కారణాల వల్ల బీపీ పెరుగుతూ ప్రమాదకర స్థాయికి చేరుతుంది. అధిక బీపీ నిర్ధారణ అయిన వ్యక్తులకు పూర్తి స్థాయి చికిత్స అందుబాటులో లేనప్పటికీ దానిని నియంత్రణలో ఉంచడం, పెరగకుండా జాగ్రత్త పడడం మాత్రమే మన చేతుల్లో ఉంటుంది.

అధిక బీపీ రుగ్మత లక్షణాలు:

అధిక రక్తపోటు వల్ల తల నొప్పి, దృష్టిలో మార్పు (మసక దృష్టి), ఛాతి నొప్పి, తల తిరగడం, శ్వాస ఇబ్బందులు, వికారం, వాంతులు, ఆందోళన, చెవుల్లో శబ్దాలు, గందరగోళం, ముక్కుల్లోంచి రక్తస్రావం కావడం, అసాధారణ గుండె లయ లాంటి పలు లక్షణాలు కనిపిస్తాయి. అధిక బీపీకి చికిత్స తీసుకోని ఎడల మూత్రపిండ వ్యాధులు, గుండె/హదయనాళ జబ్బులు, స్ట్రోక్స్ లాంటి ప్రాణాంతక రోగాలకు దారి తీస్తుంది.

బీపీ నియంత్రణకు మార్గాలు:

రక్తపోటు అదుపులో ఉండడానికి ప్రతి ఒక్కరు తమ జీవన శైలిలో సమూల మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ లవణం/కొవ్వులు కలిగిన పోషకాహారం తీసుకోవడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం, శారీరక శ్రమ/వ్యాయామం చేయడం, పొగాకు/ఆల్కహాల్ వాడకాన్ని తగ్గించడం లేదా మానుకోవడం, కూరగాయలను అధికంగా తీసుకోవడం, నిశ్చలంగా కూర్చోవడాన్ని మానుకోవడం, వాకింగ్/రన్నింగ్/స్విమ్మింగ్/డాన్సింగ్/వేయిట్ లిఫ్టింగ్ లాంటి వ్యాయామాలను రోజువారీగా అలవాటు చేసుకోవడం, బరువును నియంత్రణలో ఉంచుకోవడం లేదా అధిక బరువును తగ్గించుకోవడం, వైద్యులు సూచించిన ఔషధాలను క్రమం తప్పకుండా తీసుకోవడం, తరుచుగా బీపీ చెకప్ చేయించుకోవడం, ఒత్తిడి/ఆందోళనలకు దూరంగా ఉండడం లాంటి పలు జాగ్రత్తలు పాటించుట ద్వారా అధిక బీపీ సమస్య దూరం అవుతుంది.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# సెప్టెంబర్ నుంచి విశాఖ నుంచి పరి పాలన కొనసాగింపు

## -ఏపీ సీఎం జగన్ కీలక ప్రకటన

శ్రీకాకుళం ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఏపీ సీఎం జగన్ కీలక ప్రకటన చేశారు. సెప్టెంబర్ నుంచి విశాఖ నుంచే పాలన ప్రారంభించనున్నట్టు స్పష్టం చేశారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. రూ.4,361 కోట్ల వ్యయంతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం జరగనుంది. అలాగే ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్.. హిరమండలం వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జగన్ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. విశాఖలో సెప్టెంబర్ నుంచి కాపురం పెడతామన్నారు. వికేంద్రీకరణలో భాగంగా విశాఖలోనే బస చేస్తామన్నారు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేస్తామని జగన్ వెల్లడించారు. వికేంద్రీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనేదే తన తపన అని జగన్ చెప్పుకొచ్చారు. పెత్తందార్లకు, పేదల పక్షాన ఉన్నవారికి మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఇంకా జగన్ మాట్లాడుతూ.. "మీ బిడ్డ ఒక్కడే ఒకవైపు ఉన్నాడు. మిగతా వారందరూ ఏకమవుతున్నారు. అందరూ ఏకమై చీకటి యుద్ధం చేస్తున్నారు. ఒకే అబద్ధాన్ని పదేపదే చెబుతూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. మూలపేట పోర్టు అభివృద్ధికి మూలస్తంభం. రాబోయే రోజుల్లో శ్రీకాకుళం ముఖచిత్రం మారుతుంది. మూలపేట పోర్టు 100 బిలియన్ల సామర్థ్యానికి చేరుతుంది. మూలపేట పోర్టుతో 35 వేల మందికి ఉపాధి అవకాశం ఉంది. మూలపేట పోర్టుతో మరో 2 ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తామన్నారు.

# పాదచారుల దాహార్తి తీర్చడం కోసం చలి వేంద్రాలు అవసరం

హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పాదచారుల దాహార్తి తీర్చడం కోసం బోడుప్పల్ మునిసిపాలిటి పరిదిలోని సూరజ్ నగర్ కాలనీలో చలి వేంద్రాన్ని సూరజ్ నగర్ కాలనీ వెల్ఫర్ అసోసియేషన్ ఆద్వర్యం ఏర్పాటు చేసారు.ఈ చలి వెంద్రాన్ని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మునిసిపాలిటి కి చెందినా సీనియర్ బిఆర్ఎస్ నాయకులు పడతం లోకేష్‌లు ప్రారంబించారు.ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ పాదచారుల దాహార్తి ని తీర్చడానికి ఎలాంటి చలి వెంద్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు.అనంతరం కాలని ప్రదాన కార్యదర్శి రవి చందర్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా కాలని ఎదుట చలివేన్ద్రాన్ని ఏర్పాటు చేసి పాదచారుల దాహార్తిని తీర్చుతూ ప్రజలకు సీవను అందిస్తున్నతులు తెలిపారు. ఈ కార్యక్రమం లో కపిల్ దేవ్, ఎర్ర శంకర్,కిషోర్ యాదవ్, లక్ష్మయ్య నేత, ఖాదర్ బాబా, దేవేందర్, రబ్బాని, రాంబాబు అడ్లూరి రాజు, జగదీష్ ,ఎట్లా అశోక్, యూత్ ప్రెసిడెంట్ విజయ్, సతీష్, కావలి రాజేందర్, శ్రీధర్, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కోసమే తెలంగాణలో కాంగ్రెస్ పనిచేస్తోంది: బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్

హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డిపై తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ కోసమే తెలంగాణలో కాంగ్రెస్ పనిచేస్తోందని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒప్పందంపై ప్రజలకు రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.కేసీఆర్ సహా దేశంలో రెండు డజన్ల మంది ప్రధాని పదవిని కోరుకుంటున్నారని, బీఆర్ఎస్ కోసమే రేవంత్ రెడ్డి తెలంగాణలో పాదయాత్ర చేస్తున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో ఖర్గే, బీఆర్ఎస్ దోస్తీపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని తరుణ్ చుగ్ డిమాండ్ చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని, ఖర్గే, నితీష్, మమతాబెనర్జీ, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవి కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు.తెలంగాణలో కేసీఆర్ అత్యాచార ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని తరుణ్ చుగ్ అన్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపేవరకు పోరాటం చేస్తామని, నిరుద్యోగులకు లక్ష రూపాయల ఆర్థికసాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో నిరుద్యోగుల పక్షాన ఆందోళలు కొనసాగిస్తామని తరుణ్ చుగ్ స్పష్టం చేశారు.

# బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం, ఏప్రిల్ 20: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలైన పి.ఎం.జీవన్ జ్యోతి బీమా యోజన, పి.ఎం.సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ నాగ లక్ష్మి తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని, జిల్లాలో ఉన్న హై రిస్క్ ప్రజలంతా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం బ్యాంకర్లతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల నమోదు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిఎం జీవన్ జ్యోతి పథకం కింద 18 నుండి 50 సంవత్సరాల వయసు గలిగినవారు సం.నకు 436 రూపాయలను చెల్లిస్తే 2 లక్షల రూపాయలు ఇన్సురెన్సు వస్తుందని తెలిపారు. అదే విధంగా పీఎం సురక్షా బీమా క్రింద 18 నుండి 70 సంవత్సరాల వయసు వారు 20 రూపాయలు చెల్లిస్తే ప్రమాద బీమా కింద 2 లక్షలు వరకు చెల్లిస్తారని, ప్రమాదంలో అంగవైకల్యం కలిగిన వారికీ కూడా వర్తిస్తుందని పథకం వివరాలను వెల్లడించారు. ఈ పథకాలలో నమోదు చేయడానికి ఈ నెల 1 నుండి జూన్ 30 వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక అవగాహనా సదస్సులు నిర్వహించాలని బ్యాంకర్లకు తెలిపారు. లక్ష్యాలతో సంబంధం లేకుండా జిల్లాలో ఉన్న ఉపాధి కూలీలను, ఆటో డ్రైవర్లను, డ్వాక్రా మహిళలను, కల్లు గీత కార్మికులను, భవన కార్మికులను హై రిస్క్ ఉన్న రంగాల్లో పని చేస్తున్న వారందరిని ఈ పథకం క్రింద నమోదు చేయాలనీ సూచించారు.

పథకంలో చేరడానికి కావలసిన డాక్యుమెంట్ల వివరాలు, ఫోటోలు, అర్హతలు తదితర అంశాల గురించి ముందు రోజే గ్రామాల్లో వాలంటీర్ల ద్వారా తెలియజేయాలని, మరుసటి రోజు నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో ముందుగానే ఒక షెడ్యూల్ తాయారు చేసుకోవాలని, సచివాలయాల్లో, బ్యాంకులలో ఈ షెడ్యూల్ ను ప్రదర్శించాలని తెలిపారు. మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి సిబ్బందికి పూర్తిగా అవగాహన కలిగించాలని, తర్వాత గ్రామ స్థాయిలో క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. ప్రతీ వారం ఈ నమోదు వివరాల నివేదికను తనకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమాల్లో బ్యాంకర్లే కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దీనితో పాటు బ్యాంకు అధికారులు జగనన్న తోడు, పంట రుణాల మంజూరు, పరిశ్రమలకు ప్రోత్సహించే రుణాల లక్ష్యాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎల్.డి.ఎం శ్రీనివాస రావు, నాబార్డ్ డిడి నాగార్జున, డి.ఆర్.డి.ఎపిడి కళ్యాణ చక్రవర్తి, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ డా.అశోక్ కుమార్, డి.పి.ఓ శ్రీధర్ రాజు, డి.ఎల్.డి.ఓ నిర్మలా కుమారి, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమిత్ షాకు ఫోన్ కాల్ చేసి మాట్లాడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా: మమతా

కోల్‌కతా ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫోన్ కాల్ చేసి మాట్లాడినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ పార్టీ హోదా కోల్పోవడంతో దానిని పునరుద్ధరించాలంటూ అమిత్ షాకు మమతా బెనర్జీ ఫోన్ చేశారంటూ బీజేపీ నేత సువేందు అధికారి మంగళవారం ఆరోపించారు. దీంతో మమతా బెనర్జీ దీనిపై బుధవారం స్పందించారు. 'ఇది తెలిసి నేను ఆశ్చర్యపోవడంతోపాటు షాక్ అయ్యాను. తృణమూల్ జాతీయ పార్టీ హోదా గురించి అమిత్ షాకు ఫోన్ చేసినట్లు నిరూపిస్తే నేను రాజీనామా చేస్తా' అని అన్నారు.

సెక్రటేరియట్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కాగా, వచ్చే ఏడాది జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా కలిసివచ్చేందుకు ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ప్రయత్నాలపై కూడా మమతా బెనర్జీ మాట్లాడారు. 'కొన్నిసార్లు మౌనం బంగారం. ప్రతిపక్షం కలిసి కూర్చోని మాట్లాడు కోదని అనుకోవద్దు. మేమంతా కలిసే ఉన్నాం. అందరూ ఒకరితో ఒకరు సంబంధాలు కొనసాగిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు గాలివానలా జరుగుతుంది' అని అన్నారు. అలాగే స్వలింగ వివాహాన్ని చట్టబద్ధం చేయడంపైనా మమతా బెనర్జీ స్పందించారు. ఈ విషయం కోర్టు పరిధిలో ఉన్నందున సున్నితమైన ఈ అంశంపై తాను మాట్లాడబోనని చెప్పారు. కోర్టు ఆదేశం తర్వాత మనకు ఒక అభిప్రాయం ఏర్పడుతుందని అన్నారు.

# కోవిడ్-19పై ప్రజారోగ్య వ్యవస్థ స్పందన స్థితిగతుల మీద ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.కె.మిశ్రా అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:దేశవ్యాప్తంగా ఇటీవల కోవిడ్-19 కేసుల నమోదు పెరుగుతున్న దృష్ట్యా ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.కె.మిశ్రా తన అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలో కోవిడ్-19 పరిస్థితి, ఆరోగ్య మౌలిక సదుపాయాలతోపాటు రవాణా, మందులు, టీకాల కార్యక్రమం తదితర అంశాల్లో ప్రజారోగ్య వ్యవస్థ సన్నద్ధతను సమావేశం సమీక్షించింది. దీంతోపాటు కోవిడ్-19 కేసులు వేగంగా పెరగడంపై తీసుకోవాల్సిన కీలక చర్యలపై చర్చించింది.

ఈ సమావేశంలో కేంద్ర మంత్రి మండలి కార్యదర్శి శ్రీ రాజీవ్ గౌబా; నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వినోద్ పాల్; ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ టి.వి.సోమనాథన్; ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్; ఔషధ పరిశ్రమల విభాగం కార్యదర్శి శ్రీమతి ఎస్.అపర్ణ; పౌర విమానయాన శాఖ కార్యదర్శి శ్రీ రాజీవ్ బన్సల్; ఆయుష్ కార్యదర్శి శ్రీ రాజేష్ కోటేచా; డిహెచ్ఆర్, ఐసీఎంఆర్ డీ.జీ శ్రీ రాజీవ్ బహల్; బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి శ్రీ రాజేష్ ఎస్ గోఖలే; సమాచార-ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో భాగంగా- ప్రపంచవ్యాప్త కోవిడ్-19 పరిస్థితులపై విస్తృత సమాచారంతో ఆరోగ్య-కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్ సమగ్ర ప్రదర్శ ఇచ్చారు. దేశంలోనూ కోవిడ్-19 మళ్లీ వేగంగా వ్యాపిస్తున్నదని తెలిపారు. ప్రధానంగా 8 రాష్ట్రాల్లో (కేరళ, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్) కేసులు అధికంగా నమోదవుతున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా రోగ నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా సాగుతున్నందున కేసుల నమోదు అధికంగా కనిపిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. ఇందులో చురుకైన కేసులపై సమగ్ర విశ్లేషణ ఇన్తా ఈ 8 రాష్ట్రాల్లో నమోదైనవాటిలో 92 శాతం నివాస ఏకాంత చికిత్సకు పరిమితమైనవేనని వివరించారు.

ఈ ప్రదర్శన సందర్భంగా 2023 జనవరి నుంచి వివిధ రకాల వైరస్ జన్యుక్రమం నిర్ధారణ సమాచారంతోపాటు భారత్‌లో విస్తరిస్తున్న నిష్పత్తిని కూడా వివరించారు. అటుపైన దేశవ్యాప్తంగా టీకాల పరిస్థితి గురించి, మందుల లభ్యతతోపాటు వైద్య మౌలిక సదుపాయాల సన్నద్ధతపైనా సమావేశం చర్చించింది. గౌరవనీయ ప్రధానమంత్రి ఆదేశాల మేరకు కార్యాచరణకు తగిన మౌలిక సదుపాయాలపై అంచనాల దిశగా ప్రయోగాత్మక కసరత్తు చేపట్టినట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పరిస్థితులను భాగస్వామ్య వ్యవస్థలకు అందజేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు కోవిడ్-19 టీకాల కార్యక్రమ వ్యయం, మందులతోపాటు టీకా ముడిపదార్థాల బడ్జెట్ కేటాయింపులు తదితరాలపైనా సమావేశం సమీక్షించింది.

ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నుంచి ముందస్తు అనుమతితో నిమిత్తం లేకుండా తయారీదారుల నుంచి అవసరమైన కోవిడ్ టీకాలను నేరుగా కొనుగోలు చేసుకోవచ్చునని ఇప్పటికే రాష్ట్రాలకు సూచించినట్లు ఆ శాఖ కార్యదర్శి తెలిపారు. రాష్ట్రాల్లోగల ప్రైవేట్ ఆసుపత్రులు కూడా తయారీదారుల నుంచి నేరుగా టీకాలు కొనుగోలు చేయవచ్చునని, వీటిని ప్రస్తుతం అమలులోగల మార్గదర్శకాల ప్రకారం వేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ విస్తృత వివరణాత్మక ప్రదర్శన అనంతరం డాక్టర్ పి.కె.మిశ్రా మాట్లాడుతూ- స్థానికస్థాయిలో కేసుల పెరుగుదలకు అనుగుణంగా ఉప-జిల్లా స్థాయిదాకా తగుమేర ఆరోగ్య మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఆయా రాష్ట్రాలతో సంప్రదించి సమగ్రంగా సన్నద్ధమయ్యేలా చూడాలని సూచించారు. కేంద్రం మార్గనిర్దేశం చేస్తున్న రాష్ట్రాలకు తాజా పరిణామాల ఆధారంగా పంపాల్సిన సలహాల స్థాయిని అంచనా వేసి, నవీకరించాలని చెప్పారు.

ముఖ్యంగా కొత్త కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రదేశాల గుర్తింపుపై తక్షణం దృష్టి సారించడం అత్యంత ప్రధానమని మిశ్రా స్పష్టం చేశారు. ఆ మేరకు ఐఎల్ఐ/ఎస్ఎఆర్ఐ కేసుల ధోరణిని రాష్ట్రాలు పర్యవేక్షించాలని, కోవిడ్-19 నిర్ధారణకు తగిన నమూనాలను పంపడమే కాకుండా సంపూర్ణ జన్యునిర్ధారణ ప్రక్రియ వేగం పెంచడంపైనా సమావేశం చర్చించింది. కోవిడ్ మహమ్మారికి సంబంధించిన "పరీక్ష, అనుసరణ, చికిత్స, టీకాలు, కోవిడ్ అనుగుణ ప్రవర్తన" సహిత ఐదంచెల సమర్థ వ్యూహం కొనసాగింపునకు డాక్టర్ పి.కె.మిశ్రా ఆదేశించారు. అదే సమయంలో కోవిడ్ సముచిత ప్రవర్తనపై ఏమరుపాటుకు తావులేకుండా పౌరులను అప్రమత్తం చేసేలా అవగాహన పెంచడం కూడా చికిత్సతో సమానమని నొక్కిచెప్పారు. ఏదేమైనా కోవిడ్-19 పరిస్థితిపై గట్టి నిఘా అవసరమని, మహమ్మారి వ్యాప్తి నిరోధానికి తగిన పటిష్ఠ చర్యలపై అలసత్వం ఎంతమాత్రం కనిపించరాదని అధికారులకు స్పష్టం చేశారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర "క్రీడా పండుగ"

హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖల మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్లోని బేగంపేట్ లో ఉన్న పర్యాటక భవన్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల జిల్లా యువజన సర్వీసుల శాఖల అధికారులతో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం ను క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ , రాష్ట్ర క్రీడ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గార్లతో కలిసి నిర్వహించారు.



-"సాట్స్ " ఆధ్వర్యంలో ..జిల్లా క్రీడా,యువజన అధికారులసమీక్ష సమావేశం
-హాజరైన 33 జిల్లాల డివైఎస్ఓ లు
-ముఖ్యఅతిథిగా హాజరైన క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్,అతిథులుగా హాజరైన సాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ,కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా.

ఈ సమీక్ష సమావేశంలో మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గారి ఆదేశాల మేరకు భవిష్యత్తులో దేశంలో జరిగే అన్ని క్రీడాంశాలలో తెలంగాణ క్రీడాకారులు ఇతర రాష్ట్రాల క్రీడాకారుల కంటే జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో పతకాలు సాధించడంలో ముందుండాలని రాష్ట్ర క్రీడా శాఖ అధికారులకు, జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలని లక్ష్యంతో మండల స్థాయి నుండి జిల్లా స్థాయి జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో సీఎం కప్ నిర్వహిస్తామన్నారు. త్వరలో సీఎం కప్ షెడ్యూల్ ని అధికారికంగా ప్రకటిస్తామన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను విజయవంతం చేసేలా స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలను కార్పొరేట్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాలను అన్ని గ్రామాలలో పూర్తి అయ్యేలా డివైఎస్ఓలు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్మిస్తున్న క్రీడా మైదానాలు సత్వరం పూర్తి అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నగరంలో ఉన్న అన్ని ప్రధాన క్రీడా మైదానాలలో మైనర్ రిపేర్లను వెంటనే చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీఎం కప్ నిర్వహణ త్వరలో ఉద్యోగ సంఘాలతో,వివిధ క్రీడా సంఘాలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ క్రీడలకు పెద్దపీట వేసేలా తెలంగాణ సనీస్కృతి, క్రీడల ఉత్సవాలన నిర్వహించేలా అందుకు తగిన కార్యాచరణను రూపొందించాలని మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఉన్నతాధికారులు ధనలక్ష్మి, సుజాత, దీపక్, చంద్రారెడ్డి, డాక్టర్ హరి కృష్ణ, 33 జిల్లాల కు చెందిన డివైఎస్ఓ లు పాల్గొన్నారు.

# సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతి ప్రాంతంలో ఫైర్ సేఫ్టీ పై అవగాహన

హైదరాబాద్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతి ప్రాంతంలో ఫైర్ సేఫ్టీ పై అవగాహన కలిపిస్తున్నామని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఈరోజు మాదాపూర్ యశోద హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ వర్క్ షాప్ నిర్వహించామని వెల్లడించారు. యశోద హాస్పిటల్స్‌లో చాలా బాగా ఫైర్ సేఫ్టీ రేటెడ్ అధికారులను పెట్టుకున్నారని పేర్కొన్నారు. ప్రతి హాస్పిటల్‌లో ఫైర్ సేఫ్టీ అనేది అవసరమన్నారు. ఈ హాస్పిటల్లో ప్రతి ఒక్కరికీ ఫైర్ సేఫ్టీ పై అవగాహన ఇస్తే చాలా బాగుంటుందని, అందులో నర్సులకి కుడ ట్రైనింగ్ ఇస్తే బాగుంటుందన్నారు. ముఖ్యంగా ఫైర్ ఎక్స్టిన్స్ ఉంటాయి వాటిని ఎలా వాడాలి అనే దాంట్లో అవగహన ఉండాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ వాడేటప్పుడు చాలా శబ్దాలు వస్తాయి అలాంటప్పుడు భయపడకుండా పట్టుకుంటే కొద్దిసేపటికి సౌండ్ రావడం బంద్ అవుతుంది కావున అలా భయపడకుండా పట్టుకొని ఎలా ఉపయోగించాలో తెలుసుకొని వాడితే ప్రమాదాల నుండి బయట పడవచ్చున్నారు. మాదాపూర్ యశోద హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ వర్క్ షాప్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫైర్ సరీ్వసెస్ డీజీ నాగిరెడ్డి, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

# చికిత్స కోసం సర్కారు దవాఖానాకెళ్తే స్పందించలే.. కలెక్టర్ కు ఫిర్యాదు..



నిజామాబాద్, ఏప్రిల్ 20: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స కోసం సర్కారు దవాఖానాకు తీసుకెళ్తే ఎవరు స్పందించలేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, నవీపేట మాజీ ఉప సర్పంచ్ తెడ్డు, పోశెట్టి, నవీపేట గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తెడ్డు పోశెట్టి, నవీపేట గ్రామ ప్రజలు కలెక్టరేట్ ఎదుట తమ నిరసనను వ్యక్తం చేసి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హను మంతుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయి కుమార్ అనే వ్యక్తి బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్ప త్రికి తీసుకెళ్లామని తెలిపారు. అక్కడ ఆసుపత్రి లో ఎవరు పట్టించు కోలేదని ఆరోపిం చారు. అంతేకాకుండా ఓ ప్రజా ప్రతినిధితో సైతం ఫోన్ చేయించామని పేర్కొన్నా రు. 2 గంటల పాటు వైద్యం కోసం నిరీక్షించిన ఫలితం లేదని తెలిపారు. గాయపడి న వ్యక్తి పరిస్థితి విషమించ డంతో వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లామని వివరించారు. రాష్ట్ర ప్ర భుత్వం కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరిస్తే కనీసం నిజామాబాదు ప్రభుత్వ దవాఖానాలో వైద్యులు సిబ్బంది తమ విధులను సరిగా నిర్వర్తించకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న సంఘటనలపై వైద్య శాఖా మంత్రి తన్నీరు హరీష్ రావు విచారణ కమిటీలు వేసినా? కమిటీ బృందం నిజామాబాద్ ఆసుపత్రిలో పరిశీలించిన.. నిజామాబాదు జిల్లా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది తీరు లో ఎటువంటి మార్పు లేదని పేర్కొ న్నారు. ఈ సంఘటనపై వెంటనే విచా రణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసు కొని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో సౌకర్యాల మెరు గుదలపై ప్రత్యేక చర్య లు తీసు కోవాలని జిల్లా కలెక్టర్ కోరా రు. ఈ కార్యక్రమంలో సూరి బాబు, రాకేష్ శ్రీకాంత్, నవీపేట గ్రా మ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ కి గుజరాత్‌లోని సూరత్ కోర్టులో చుక్కెదురు

సూరత్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కి గుజరాత్‌లోని సూరత్ కోర్టులో చుక్కెదురైంది. 2019లో కర్ణాటకలో ఆయన మోదీ ఇంటి పేరు గలవారిపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో క్రింది కోర్టు ఆయనను దోషిగా తీర్పు చెప్పడంపై ఆయన చేసిన అపీలును సూరత్ సెషన్స్ కోర్టు గురువారం తిరస్కరించింది. క్రింది కోర్టు తీర్పును నిలుపుదల చేయాలని, సస్పెండ్ చేయాలని ఆయన చేసిన వినతిని సెషన్స్ కోర్టు అంగీకరించలేదు. ఆయన అపీలుపై ఇరు పక్షాల వాదనలను ఏప్రిల్ 13న కోర్టు స్వీకరించింది. అనంతరం తీర్పును రిజర్వు చేసింది. ఈ తీర్పు గురువారం వెలువడింది. రాహుల్ గాంధీ 2019లో కర్ణాటకలోని కోలార్‌లో ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ, దొంగలందరి ఇంటి పేరు మోదీ ఎలా అవుతోందని ప్రశ్నించారు. దీనిపై గుజరాత్‌కు చెందిన పూర్ణేశ్ మోదీ సూరత్ కోర్టులో పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఈ కేసులో రాహుల్ గాంధీ దోషి అని కోర్టు తీర్పు చెప్పింది. ఆయనకు రెండేళ్ళ జైలు శిక్ష విధించింది. దీంతో ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. ఇది కక్షపూరిత చర్య అని కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. సెషన్స్ కోర్టు రాహుల్ గాంధీ అపీలును అనుమతించినట్లయితే, ఆయనకు విధించిన శిక్ష, దోషిత్వ తీర్పును సస్పెండ్ చేసి ఉంటే, ఆయన లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ జరిగి ఉండేది.

# ఈ నెల 22 లోగా మంజీరా కుంభమేళా ఏర్పాట్లు పూర్తి చేయాలి...!

-సాధువులు, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టాలి.
-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.



సంగారెడ్డి,ఏప్రిల్ 20 (నేటి నిజం ప్రతినిధి) న్యాల్కల్ మండలంలోని రాఘవపూర్ పంచవటీ క్షేత్ర పరిసరాల్లో జరిగే గరుడ గంగ పూర్ణ మంజీరా కుంభమేళాకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఈ నెల 22 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, జహీరాబాద్ డివిజన్ అధికారులతో కుంభమేళ ఏర్పాట్ల పురోగతిపై జిల్లా ఎస్పీ రమణ కుమార్ తో కలిసి సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 నుండి జరగనున్న కుంభమేళాకు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే సాధువులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు.

కుంభమేళాకు వచ్చే మార్గంతో పాటు నదీ తీరంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.

మంజీరా నదిలో భక్తుల కోసం స్నానఘట్టాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పురుషులకు వేరువేరుగా షవర్స్ ఏర్పాటు చేయాలని, వాటర్ ఫ్రెష్ గా వచ్చేలా చూసుకోవాలనీ, మహిళలు బట్టలు మార్చు కునేందుకు ప్రత్యేక షెడ్లు ఏర్పాటు చేయాలనీ,24 గంటలు నీటి సరఫరా ఉండాలని త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని, షిఫ్టుల వారిగా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణ నజావుగా జరిగేలా చూడాలని డిపిఓ కు సూచించారు.

ట్రాలీలు, ట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు చెత్త సేకరణ జరిగేలా చూడాలని డివిజనల్ పంచాయతీ అధికారికి ఎంపీడీవోకు సూచించారు.

ఎండల తీవ్రత దృష్ట్యా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులను,సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సూచించారు.

కుంభమేళాకు కర్ణాటక, మహా రాష్ట్ర ల నుండి హాజరయ్యే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడపాలని, అదేవిధంగా అదనపు బస్సులను నడవాలని ఆర్టీసీ ఆర్ఎం కు సూచించారు.

కుంభమేళా జరిగే రోజుల్లో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ ను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండా లని, ఫైర్ ఇంజన్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

నది తీరాన గజ ఈతగాళ్ళ ను బోట్లతో సహా ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. మద్యం అమ్మకాలు జరగకుండా అన్ని రకాల కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారికి ఆదేశించారు. ఆహార పదార్థాల నాణ్యత విషయమై రోజుకు ముగ్గురు చొప్పున వెళ్లి తనిఖీ చేసేలా చర్యలు చేపట్టాలని ఫుడ్ ఇన్స్పెక్టర్ కు సూచించారు.

గుడికి సంబంధించి అలంకరణ, సైన్ బోర్డ్స్ ఏర్పాటు, చుట్టుపక్కల ముళ్ళ పొదల తొలగింపు, రూట్ వారీ డైరెక్షన్స్ ఉండేలా రూట్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆర్డిఓ రమేష్ బాబుకు సూచించారు.

వీఐపీ పార్కింగ్, ఇతర పార్కింగ్ ఏర్పాట్లను, ఘాట్స్ వద్ద బారికేడ్స్ తదితర ఏర్పాట్లను ఆయా అధికారులు ప్రణాళికతో చేయాలన్నారు.

ఆయా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి కుంభమేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

సమావేశంలో ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్,

డీపీవో సురేష్ మోహన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, నీటిపారుదల, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ, మత్స్య శాఖల జిల్లాఅధికారులు, జహీరాబాద్ నారాయణఖేడ్ రెవిన్యూ డివిజనల్ అధికారులు రమేష్ బాబు, అంబాదాస్, డీఎస్పీలు, న్యాల్కల్ మండల తహసీల్దార్ అంటోనీ, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# 2047 లో భారతదేశం ఎలా ఉండాలి అన్న అంశాన్ని 2023 నాటి యువత నిర్ధారించాలి- కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:2047 లో భారతదేశం ఎలా ఉండాలి అన్న అంశాన్ని 2023 నాటి యువత నిర్ధారించాలి' అని కేంద్ర శాస్త్ర సాంకేతిక( స్వతంత్ర బాధ్యత), భూ శాస్త్ర ( స్వతంత్ర బాధ్యత), పీఎంవో లో సహాయ మంత్రి, సిబ్బంది వ్యవహారాలు , ప్రజా ఫిర్యాదులు, పెన్షన్, అణుశాస్త్రం, అంతరిక్ష వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ రోజు జమ్మూ విశ్వవిద్యాలయంలో శాంతి స్థాపన సయోధ్య సాధన; యుద్ధాలకు తావు లేని భవిష్యత్తు అనే అంశంపై ఏర్పాటైన యూత్ 20 సదస్సులో డాక్టర్ జితేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'దేశానికి స్వాతంత్ర్యం సాధించిన తర్వాత మూడు తరాలు గడిచిపోయాయి. దేశంలో శక్తి సామర్థ్యాలను కొరత లేదు. వాటిని సద్వినియోగం చేసుకోవడం ఒక సమస్యగా మారింది. అయితే, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. తమలో దాగివున్న శక్తి సామర్థ్యాలను ప్రదర్శించే అవకాశం యువతకి లభించింది. భారతదేశం ఏ 2047 నిర్మాణంలో నేటి యువత కీలకం గా ఉంటారు.నేడు ముప్పై ఏళ్లు నిండిన వారు ప్రధాన పౌరులు అవుతారు' అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

జీ-20 అధ్యక్ష పదవి చేపట్టిన భారతదేశానికి 2023 ఒక ముఖ్యమైన సంవత్సరం అని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశానికి సుస్థిర ప్రభుత్వాన్ని అందించారని పేర్కొన్న డాక్టర్ జితేంద్ర సింగ్ దేశంలో ప్రతి సవాలును సమర్థంగా ఎదుర్కొంటూ దేశ భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేస్తున్న పాలన సాగుతుందన్నారు. 2023 నాటి మోదీ పాలనకు 2023 యువతకు మధ్య ఉన్న పరస్పర సంబంధం ఏమిటో ఈరోజు సమావేశం దృష్టి సారించాలని ఆయన సూచించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 లో బాధ్యతలు చేపట్టిన సమయంలో ప్రభుత్వం పేదల అభ్యున్నతి, మహిళా సాధికారత, యువత అభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు. 2014కు ముందు దేశంలో నిరాశ, నిస్పృహ పరిస్థితి నెలకొని ఉందని మంత్రి అన్నారు. 2014 మే 26న ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ నరేంద్ర మోదీ ఇకపై దేశం నిరాశావాదం నుంచి ఆశావాదం వైపు ప్రయాణం సాగిస్తుందని ప్రకటించి తమ ప్రభుత్వ విధానాన్ని ప్రకటించారని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. తమ ప్రభుత్వం యువతకు ప్రాధాన్యత ఇస్తుందని శ్రీ మోడీ చేసిన ప్రకటన పట్ల అనేక మంది విశ్వసించలేదు అని మంత్రి అన్నారు. 9 సంవత్సరాల పాలనలో శ్రీ నరేంద్ర మోదీ చెప్పిన మాటకు కట్టుబడి పాలన సాగించి దేశానికి మాటల ప్రభుత్వాన్ని కాకుండా చేతల ప్రభుత్వాన్ని అందించారని డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

2014లో అధికారంలోకి వచ్చిన రెండు మూడు నెలల తర్వాత సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారులు ధృవీకరించే విధానానికి స్వస్తి పలికిన అంశాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరం తర్వాత దేశంలో ఉద్యోగ నియామకాల్లో ఇంటర్వ్యూలు రద్దు చేస్తునట్టు ప్రకటించి శ్రీ మోదీ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని మంత్రి అన్నారు. ఫేస్ రికగ్నిషన్ విధానం ద్వారా దేశంలో పెన్షన్ చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపిన శ్రీ జితేంద్ర సింగ్ దీనివల్ల వృద్ధ పౌరులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం ఉండదని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ఆన్‌లైన్ విధానంలో పారదర్శకత, జవాబుదారీతనం,ప్రజల భాగస్వామ్యంతో అమలు జరుగుతున్నాయని తెలిపారు. మానవ ప్రమేయం కనీస స్థాయికి తగ్గిందన్నారు. యువతను విశ్వసించే ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న వాస్తవాన్ని ప్రభుత్వ కార్యక్రమాలు అమలు జరుగుతున్న తీరు తెలియజేస్తున్నాయన్నారు.

ఫిర్యాదుల పరిష్కారం కోసం దేశంలో అమలు జరుగుతున్న కార్యక్రమాల వివరాలను డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని సీపీ గ్రామ్స్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాకముందు ప్రతి సంవత్సరం కేవలం 2 లక్షల ఫిర్యాదులు అందుతుండగా, ఈ ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని అనుసరించి ప్రతి సంవత్సరం 20 లక్షల ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. కాలపరిమితితో కూడిన పరిష్కార విధానం అమలు చేస్తున్న ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పొందిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

యువతకు త్వరలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని కొన్ని నెలల క్రితం దేశానికి వాగ్దానం చేసిన ప్రధాని మోదీ తన వాగ్దానం నిలబెట్టుకుని తాను చెప్పినట్టే చేస్తానని మరియు ప్రతి దాన్ని "ముమ్కిన్" (సాధ్యం) చేయగల సామర్థ్యం తనకు ఉందని రుజువు చేశారు అని మంత్రి అన్నారు.

ప్రధాని మోడీ మొదటి నుంచి యువతకు సంబంధించిన సమస్యలు, ఆందోళనలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. యువతకు జీవనోపాధి, ప్రభుత్వ ఉద్యోగాల కల్పన , ఆదాయం కోసం కొత్త మార్గాలు, అవకాశాలు కల్పించడానికి ప్రధాని నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు.

అవినీతి నిరోధక చట్టం, 1988 ను తన ప్రసంగంలో ప్రస్తావించిన డాక్టర్ జితేంద్ర సింగ్ 30 సంవత్సరాల తర్వాత 2018లో ప్రభుత్వం చట్టాన్ని సవరించి లంచం తీసుకోవడంతోపాటు లంచం ఇవ్వడాన్ని కూడా నేరంగా పరిగణించడంతో పాటు అనేక కొత్త నిబంధనలను ప్రవేశ పెట్టిందన్నారు. వ్యక్తులు కార్పొరేట్ సంస్థలు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా సవరణలు సహకరిస్తాయన్నారు.

2015 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీయే "స్టార్టప్ ఇండియా స్టాండ్అప్ ఇండియా" అంటూ ఇచ్చిన పిలుపును గుర్తు చేసిన డాక్టర్ జితేంద్ర సింగ్ దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారిందన్నారు. ప్రధానమంత్రి పిలుపుతో భారతదేశంలో స్టార్టప్‌ల సంఖ్య 2014లో 300 నుండి 400 కి పెరిగి నేడు 75,000కు పైగా పెరిగిందన్నారు. స్టార్టప్ రంగంలో భారతదేశం ప్రపంచంలో 3వ స్థానంలో ఉందని ఆయన తెలిపారు. అంతేకాకుండా, 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అందించిన సహకారం, కల్పించిన వసతుల వల్ల దేశంలో బయోటెక్ స్టార్టప్‌ల సంఖ్య గత 8 సంవత్సరాలలో 50 నుంచి 5,000కు పెరిగిందన్నారు. 2025 నాటికి వీటి సంఖ్య 10,000 చేరే అవకాశం ఉందన్నారు. 2014 నాటికి కేవలం 10 బిలియన్ డాలర్లుగా ఉన్న బయో ఎకానమీ నేడు 80 బిలియన్ డాలర్ల స్థాయికి చేరిందని, 2025 నాటికి 100 బిలియన్ డాలర్లు చేరాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు.

ఉత్తరాఖండ్‌తో సహా హిమాలయ రాష్ట్రాలు సుగంధ స్టార్టప్‌లకు కేంద్రంగా మారాయని మంత్రి అన్నారు. , "పర్పుల్ రివల్యూషన్" లేదా "అరోమా మిషన్ " ద్వారా జమ్మూ,కాశ్మీర్ స్టార్టప్ ఇండియాకు సహకారం అందిస్తోందని ఆయన అన్నారు. అరోమా మిషన్ దేశవ్యాప్తంగా స్టార్టప్‌లు, వ్యవసాయదారులను ఆకర్షిస్తోంది అని అన్నారు. ఈ రంగంలో 44,000 మందికి పైగా శిక్షణ పొందారని, అనేక కోట్ల మంది రైతుల ఆదాయం పెరిగిందని మంత్రి తెలిపారు.

ఈశాన్య ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. 100 ఏళ్ల నాటి భారతీయ అటవీ చట్టం పరిధి నుంచి ఇంట్లో పండించే వెదురును మినహాయించాలని శ్రీ మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. వెదురు రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేయడంలో ప్రభుత్వ నిర్ణయం సహాయ పడిందన్నారు. విస్తారమైన సముద్ర వనరులు అన్వేషించడానికి గత ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదని డాక్టర్ జితేంద్ర సింగ్ ఆరోపించారు. శ్రీ నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా సముద్ర వనరులు అన్వేషణ, వినియోగం కోసం ప్రణాళిక రూపొందించారని మంత్రి తెలిపారు. దేశంలో నీలి ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి సాంప్రదాయిక విద్యా రంగంలో వచ్చిన మార్పులను డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. 2014 ప్రారంభంలో దేశంలో 725 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నాయన్నారు. ప్రతి వారం 1 కొత్త విశ్వవిద్యాలయం చొప్పున ప్రారంభించిన ప్రభుత్వం గత 9 సంవత్సరాల కాలంలో దేశంలో కొత్తగా 300 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య దేశంలో 145 వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. రోజుకు 1 వైద్య కళాశాల , రోజుకు 2 డిగ్రీ కళాశాల చొప్పున 260 కి పైగా వైద్య కళాశాలలు ప్రారంభించామని మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరికి విద్య అందుబాటులో ఉంది అని మంత్రి అన్నారు. సౌకర్యాలు అందుబాటులో లేనందున ఎవరూ విద్యకు దూరం కాకూడదు అన్నది తమ ప్రభుత్వ విధానం అని స్పష్టం చేశారు.

జమ్మూ సెంట్రల్ యూనివర్శిటీ ఉత్తర భారతదేశంలో మొట్టమొదటి అంతరిక్ష బోధన విభాగాన్ని ప్రారంభించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. విద్య నుంచి డిగ్రీని డి-లింకింగ్ చేయడం నూతన జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలలో ఒకటి అని చెప్పిన మంత్రి డిగ్రీని విద్య తో అనుసంధానించడం వల్ల మన విద్యా వ్యవస్థ,సమాజం నష్టపోయాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. విద్యా విధానం వల్ల చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచంలో భారతదేశం ఒక భాగంగా మారిపోయిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా జీవించడానికి, ప్రపంచ సవాళ్లు ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉండాలన్నారు. వాతావరణ మార్పు, క్లీన్ ఎనర్జీ మొదలైన ప్రపంచ సమస్యల పరిష్కారానికి చర్యలు అవసరమన్నారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యతను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గుర్తించి దీనికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. సమీప భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ ప్రధాన ఎగుమతిదారుల్లో భారతదేశం ఒకటిగా ఉంటుందన్నారు. .

జీ-20 కింద ఏర్పాటైన ఎనిమిది అధికారిక ఎంగేజ్‌మెంట్ గ్రూపులలో యూత్20 ఒకటని మంత్రి తెలిపారు. జీ-20 ప్రభుత్వాలు, ఆయా దేశాల్లో నివసిస్తున్న యువత మధ్య సంబంధాలు మెరుగు పరచడానికి యూత్-20 కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. 2023 లో భారతదేశం నిర్వహించే వై-20 ఇండియా సదస్సు భారతదేశం అమలు చేస్తున్న యువత-కేంద్రీకృత చర్యలు వివరిస్తుందన్నారు.సదస్సు ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువతకు భారతదేశం విలువలు, విధానపరమైన చర్యలు తెలుసుకోవడానికి సదస్సు అవకాశం కల్పిస్తుందన్నారు.

భారతదేశ భవిష్యత్తులో తమ పాత్ర ఏ విధంగా ఉండాలి అన్న అంశాన్ని యువత తమకు తాము నిర్ణయించుకుని లక్ష్య సాధన కోసం కృషి చేయాలని డాక్టర్ జితేంద్ర సింగ్ సూచించారు. దేశ భవిష్యత్తు కోసం తమ శక్తి సామర్థ్యాలు పూర్తిగా ఉపయోగపడేలా యువత తమను తాము రూపొందించుకుని "నేను భారతదేశానికిఏ100 రూపశిల్పిని " అని గుర్తించి ముందుకు సాగాలని మంత్రి కోరారు.

# ఆర్టీసీ బస్సు.. ఆటో ఢీ.. ఆటో డ్రైవర్ మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 20: ఆర్టీసీ బస్సు ఆటో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని ఎస్ ఏపీ కాలేజీ వద్ద చోటు చేసుకుంది.

కాగా బస్సు తాండూర్ డిపో నుండి వికారాబాద్ వస్తుంది. ఆటో వికారాబాద్ నుండి అనంతగిరి రూట్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీను. అక్కడికక్కడే మృతి చెందినాడు. ఆటో డ్రైవర్ సొంత గ్రామం ధరూర్ మండల్ ఎబ్బనూర్.గ్రామం అని సమాచారం ..పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాజకీయ నిర్మాణంతోనే అధికారంలోకి బీసీలు..ఆ దిశగా అడుగులు

## -బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్

కరీంనగర్ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బీసీలు తాము బలమైన ఓటు బ్యాంకు గా ఉన్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసి, కార్పొరేటర్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పర్సన్, ఎమ్మెల్యే, ఎంపీ తదితర స్థానాలలో పోటీకి సిద్ధమయ్యేలా, తమ రాజకీయ ప్రాతినిధ్య స్థానాలను తామే కైవసం చేసుకునేలా బలమైన క్షేత్ర స్థాయి నిర్మాణాన్ని చేపడుతున్నామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ తెలిపారు..

అందుకు అనుగుణంగా తెలంగాణఉద్యమంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆర్టీసీ జేఏసీ మాజీ చైర్మన్ దొంత ఆనందం గారిని గౌరవ అధ్యక్షులుగా, సామాజిక ఉద్యమాలలో అలుపెరుగని కార్యక్రమాలను నిర్వహించిన సుతారి లచ్చన్నను సంస్థ ప్రధాన కార్యదర్శిగా మరియు సీనియర్ బీసీ ఉద్యోగ సంఘాల ,కుల సంఘాల నాయకుడు గడప కోటేష్ కుమార్ ను రాష్ట్ర సెక్రటరీ గా ముఖ్య నాయకుల సమక్షంలో నియామక పత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. నియామక పత్రాలు స్వీకరించిన నాయకులు బీసీలను రాజ్యాధికారం వైపు పయనింపజేసేలా శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్. మల్లేశం,ప్రసాద్ యాదవ్,మీస కొమురయ్య, కడారి ఐలయ్య,బండి మల్లయ్య యాదవ్,మేకల శ్రీకాంత్ , కొండ రవీందర్,కట్ట రమేష్ , అడెపు దినేష్,చిగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేటు దిశగా విశాఖ ఉక్కుఅడుగులు ..

విశాఖపట్టణం ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రేస్ న్యూస్ );: విశాఖ స్టీల్ ప్లాంట్ ఈవోఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) బిడ్డింగ్ గడువు ముగిసింది. గత నెల 27న విడుదలైన ఈవోఐ ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం వరకు ఆసక్తిగల కంపెనీలు బిడ్లు దాఖలు చేయవచ్చని ఆహ్వానించారు. 22 కంపెనీలు బిడ్‌లు దాఖలు చేసినట్టు సమాచారం. కాగా బిడ్ దాఖలుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం గమనార్హం. ఈవోఐ గడువు పెంచినా ఈవోఐ బిడ్డింగ్ కి స్పందన కనిపించలేదు.

ఈవోఐ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) బిడ్లలో ప్రభుత్వాలు నేరుగా పాల్గొనేందుకు వీల్లేకపోవడంతో కంపెనీలు మాత్రమే పాల్గొనాలి. ఈ నేపథ్యంలో.. తెలంగాణ సర్కారుకు సింహభాగం వాటా ఉన్న సింగరేణి సంస్థను రంగంలోకి దించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారంటూ భారీ ప్రచారం జరిగింది. కానీ అవన్నీ ఉత్తదేనని తేలిపోయింది. సింగరేణి బిడ్ వేయక పోవడంపై కారణాలు చెప్పాలని కార్మిక సంఘాలు పట్టుబట్టాయి.

వాస్తవానికి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రలు ఫలించే పరిస్థితి కనిపిస్తోంది. 'విశాఖ ఉక్కు' తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడింది. ముడి పదార్థాల కొనుగోలుకు అవసరమైన నిధులు, కంపెనీ నిర్వహణకు అవసరమయ్యే మూలధనం (వర్కింగ్ క్యాపిటల్) కోసం నానా తిప్పలు పడుతోంది. ఉక్కు ఉత్పత్తిలో ఉన్న ఏదైనా కంపెనీ ఈ నిధులు సమకూరిస్తే.. అందుకు బదులుగా ఉక్కు సరఫరా చేస్తామని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, విశాఖ ఉక్కు) ప్రకటించింది. ఇందుకు కంపెనీలు ఈ నెల 15వ తేదీలోగా ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)లు సమర్పించాలని కోరిన విషయం తెలిసిందే.

ఆర్థికంగా కుంగదీసి..

విశాఖ స్టీల్ ప్లాంట్ దాదాపుగా దివాలాకు దగ్గర్లో ఉందని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ప్రారంభంలోనే ప్రకటించింది. ఇప్పుడు 'నిధులకు స్టీల్' ప్రతిపాదనకు ఎవరూ ముందుకు రాకపోతే దివాలకు మరింత దగ్గరైనట్టేనని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలనే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆర్థికంగా కుంగదీసి ప్రైవేటుపరం చేసే కుట్ర చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తు ప్రమాదంలో పడింది.

విశాఖ స్టీల్ ప్లాంట్ నెత్తిన ప్రస్తుతం రూ.22,000 కోట్ల వరకు అప్పులున్నాయి. వాటికి ఏటా రూ.2,200 కోట్ల వరకు అసలు, వడ్డీలు చెల్లిస్తోంది. ఇది చాలదన్నట్టు పేరుకుపోతున్న వేల కోట్ల నష్టాలు కంపెనీని ఆర్థికంగా మరింత కుంగదీస్తున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు మరో ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్(స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా)లో విలీనం చేయాలని ఉద్యోగ సంఘాలు కోరాయి. కేంద్ర ప్రభుత్వం అందుకు ససేమిరా అనడంతో ప్లాంట్ భవిష్యత్తే ప్రమాదంలో పడింది.

ప్రైవేటు దిశగా విశాఖ ఉక్కు

రేషనలైజేషన్ పేరుతో విశాఖ ఉక్కులో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా నిర్ణయాలను అమలు చేస్తోంది. ప్రైవేటీకరణను అటు కార్మిక సంఘాలు, ఇటు రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో పరోక్ష పద్ధతులను ఎంచుకుంది. నోటితో చెప్పకుండా అన్యాపదేశ ఆదేశాలతో ఉద్యోగ నియామక ప్రక్రియను పూర్తిగా నిలిపివేసింది. తద్వారా ప్రైవేటీకరణకు మార్గాన్ని సుగమం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. స్టీల్ ప్లాంట్‌లో ఏటా 200 నుంచి 300 మంది ఎగ్జిక్యూటివ్ ట్రైనీలను రిక్రూట్ చేయడం ఆనవాయితీ. ఈ ప్రక్రియ ఆగిపోయింది. గత ఏడాది కేవలం ఒక్కరికే విశాఖ ఉక్కులో ఉద్యోగం వచ్చింది. ఇది చాలు ఏ స్థాయిలో నిర్ణయాలు తీసుకున్నారో అర్థం చేసుకోవడానికి. ఒకవైపు ఏటా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు... మరోవైపు యాజమాన్యం విధానాలు నచ్చక రాజీనామా చేసి వెళ్లిపోతున్న వారితో కర్మాగారం ఖాళీ అవుతోంది. ఈ ప్రభావం ఉత్పత్తిపై పడుతోంది. అయినా సరే యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. మూడేళ్ల క్రితం విశాఖ ఉక్కులో ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ కలిపి 17,000 మంది ఉద్యోగులు ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య 14,880కి పడిపోయింది. దాదాపుగా 13 శాతం తగ్గిపోయారు.

# మే నెలాఖరులోగా మన ఊరు-మన బడి పనులు పూర్తి చేయాలి : కలెక్టర్ రాజర్షి షా



మెదక్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి):మనఊరు - మనబడి కింద 30 లక్షల లోపు చేపట్టిన పనులను మే నెలాఖరునాటికి పూర్తి చేసేలా అంకిత భావంతో పని చేయాలని, అదే విధంగా 30 లక్షల పైబడి చేపట్టిన పనులను కూడా పరుగులు పెట్టించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి మండల వారీగా పాఠశాలల్లో వివిధ కాంపోనెంట్ ల క్రింద చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధుల కొరత లేదని,చేసిన పనులకు సంబంధించి వెంటనే ఏం.బి.రికార్డు చేసి, ఎఫ్.టి.ఓ. పోర్టల్ లో నమోదు చేసి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లకు అవగాహన , ధైర్యం, భరోసా కల్పించి వర్షాకాలం నాటికి పనులు పూర్తయ్యేలా కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. 30 లక్షల నుండి కోటి రూపాయల లోపు పనులకు టెండర్లు రాని ప్రాంతాలలో పాఠశాల నిర్వహణ కమిటీ లో తీర్మానం చేసి నామినేషన్ పద్ధతిన వెంటనే పనులు చేపట్టాలన్నారు.

కోటి రూపాయల పైగా పనులుండి టెండర్లు రాని వాటికి సంబంధిత శాసనసభ్యుల సహకారంతో కాంట్రాక్టర్లు పాల్గొని పనులు చేపట్టేలా చూడాలని అన్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులు, ఎస్.ఏం.సి. చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు ,కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి చేపట్టవలసిన పనులు, వాటి అంచనా, కాలవ్యవధి వంటి వివరాలు తెలిపి పనులు శరవేగంతో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎన్.ఏం.సి. సర్పంచులు ముందుకు రాని పక్షంలో తమ వద్ద ఉన్నకాంట్రాక్టర్ల ద్వారా వెంటనే పనులు మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అదనపు తరగతి గదులు మంజూరు అయిన దగ్గర వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. సాంకేతిక అనుమతులు లేని వాటికి వెంటనే మంజూరి ఇవ్వాలని అన్నారు. నిర్మాణాలు పూర్తై రంగులు వేసిన వాటికి ఏం.బి. రికార్డు చేయాలని, ఇటీవల పూర్తైన నిర్మాణాలు జాబితాను పెయింటింగ్ ఏజెన్సీ కి అందజేసి ఒప్పందం ప్రకారం పెయింటింగ్ వేయించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అలసత్వం ప్రదర్శించిన పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని అన్నారు.

# విదేశీ సంస్థల చేత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆక్స్‌ఫాం యత్నం : సీబీఐ

న్యూఢిల్లీ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: విదేశీ విరాళాల నియంత్రణ చట్టం క్రింద లైసెన్స్ పునరుద్ధరణ కోసం విదేశీ సంస్థల ద్వారా భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఆక్స్‌ఫాం ఇండియా సంస్థ ప్రయత్నించిందని సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ–అఃఐ) ఆరోపించింది. ఈ లైసెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించకపోవడంతో తన కార్యకలాపాలను కొనసాగించేందుకు ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ఆ సంస్థ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆరోపించింది. ఈ సంస్థపైనా, దాని సభ్యులపైనా నమోదు చేసిన ప్రథమ సమాచార నివేదిక లో ఈ ఆరోపణలు చేసింది. ఈ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ కోసం దరఖాస్తు 2022 జనవరిలో తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. ప్రభుత్వేతర సంస్థ ఆక్స్‌ఫాం ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలను ఉల్లంఘించినట్లు సీబీఐ సోమవారం ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ కోసం విదేశీ సంస్థల సహకారం తీసుకోవాలని ప్రయత్నించిందని తెలిపింది. యూరోపియన్ యూనియన్, అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యూరోపియన్ దేశాల ద్వారా భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నించిందని తెలిపింది. ఈ సంస్థకు వస్తున్న నిధులతో ఆందోళనలకు మద్దతిస్తోందని పేర్కొంది. విదేశాల నుంచి వచ్చిన నిధుల్లో 20 శాతం మాత్రమే అడ్మినిస్ట్రేటివ్ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి అనుమతి ఉందని, ఈ నిబంధనలను ఉల్లంఘించి, 33 శాతం నిధులను వినియోగిస్తోందని తెలిపింది. ఆదాయపు పన్ను శాఖ గత ఏడాది సెప్టెంబరులో ఆక్స్‌ఫాం ఇండియా, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ సంస్థల్లో సర్వే నిర్వహించింది. ఆక్స్‌ఫాం ఆఫీస్ బేరర్ల స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. ఆ సంస్థ ఫైనాన్షియల్ డాక్యుమెంట్లను, ఈ–మెయిల్ ఉత్తర, ప్రత్యుత్తరాలను పరిశీలించింది. ఈ అంశాలపై దర్యాప్తు జరపాలని సీబీఐని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నెల 5న ఆదేశించింది. మనీలాండరింగ్ జరిగిందేమో గుర్తించడం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు నివేదించాలని కూడా ఆదేశించింది. ఆదాయపు పన్ను శాఖ కనుగొన్న అంశాల ఆధారంగా సీబీఐ ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. విదేశీ నిధులను దారి మళ్లించడం కోసం నిబంధనలను ఉల్లంఘించడానికి ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఈ సంస్థ ప్రయత్నించిందని తెలిపింది. ఈ సంస్థ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పునరుద్ధరణ కాకపోవడంతో విదేశీ నిధులను సేకరించడం సాధ్యం కాదు.

ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ పొందడం కోసం భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఐర్లాండ్ ఎంబసీని ఆక్స్‌ఫాం ఇండియా ఆశ్రయించినట్లు ఆదాయపు పన్ను శాఖ దర్యాప్తులో వెల్లడైంది. ఆక్స్‌ఫాం మాజీ సీఈఓ అమితాబ్ బెహర్ 2022 ఫిబ్రవరి 15న రాసిన ఈ–మెయిల్‌లో ఈ విషయం ఉన్నట్లు తెలిసింది. బొగ్గు పరిశ్రమలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించే విధంగా స్థానిక యూనియన్లను రంగంలోకి దించడం కోసం ఎన్విరానిక్స్ ట్రస్ట్‌కు ఆక్స్‌ఫాం ఇండియా నిధులను సమకూర్చినట్లు వెల్లడైంది.

# ముగిసిన 'జీ 20 డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్' రెండవ సమావేశం

న్యూఢిల్లీ,ఏప్రిల్ 20:మూడు రోజుల 'జి20 డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ (డీఈడబ్ల్యూజీ) రెండో సమావేశం ఈరోజు 19 ఏప్రిల్ 2023 హైదరాబాద్‌లో ముగిసింది. ఈ సమావేశానికి జీ 20 సభ్యులు, 8 అతిథి దేశాలు, 5 అంతర్జాతీయ సంస్థలు మరియు ఒక ప్రాంతీయ సంస్థ నుండి 81 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. మొదటి రోజు, అంటే 17 ఏప్రిల్ 2023న, సైడ్ ఈవెంట్‌లలో భాగంగా మూడు నేపథ్య సెషన్‌లు నిర్వహించబడ్డాయి. సెషన్‌లలో 'హై స్పీడ్ మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ మరియు దాని ప్రభావాలు', 'డిజిటల్ సమ్మిళితం–సుదూర ప్రజల అనుసంధానం మరియు 'సుస్థిర హరిత డిజిటల్ మౌలిక సదుపాయాలు: సవాళ్లు మరియు అవకాశాలు' వంటి అంశాలు ఉన్నాయి. ఇది అంతర్జాతీయ మరియు జాతీయ నిపుణుల నుండి ప్యానెల్ మధ్య చర్చను మరియు పాల్గొనేవారితో తీవ్రమైన ప్రశ్న సమాధానాలను చూసింది. ప్రతినిధులు ఐఐటీ–హైదరాబాద్‌ను కూడా సందర్శించారు. 5జీ ఉత్పత్తులు, 5జీ ??బేస్ స్టేషన్‌లు, 6జీ సిస్టమ్ ప్రోటోటైప్‌లు, అటానమస్ నావిగేషన్ టెస్ట్‌బెడ్ మరియు ఏఐ–ఆధారిత ఆర్ ఎస్ఏ– ఎలక్ట్రానిక్ పరీక్ష కిట్ వంటి డిజిటల్ టెలికాం టెక్నాలజీల రంగంలో భారతదేశం యొక్క నవ్య పంథా ప్రాజెక్ట్‌లు మరియు అత్యాధు నిక పరిశోధనలను వీక్షించారు. రెండవ రోజు, అంటే ఏప్రిల్ 18, 2023న, కార్యకలాపాలను ఎం ఈ ఐ టీ వై కార్యదర్శి శ్రీ అల్కేష్ కుమార్ శర్మ ప్రారంభించారు మరియు ఆ తర్వాత, ఎం ఈ ఐ టీ వై జాయింట్ సెక్రటరీ శ్రీ సుశీల్ పాల్ అధ్యక్షత వహించారు. జీ 20 అతిథి దేశాలు,అంతర్జాతీయ సంస్థలు మరియు ప్రతినిధులతో చర్చలను ప్రోత్సపించారు. " డిజిటల్ నైపుణ్యాలపై పరస్పర గుర్తింపు ఫ్రేమ్‌వర్క్ "పై బహుళ–లబ్దిదారుల వర్క్‌షాప్ కూడా నిర్వహించబడింది. ప్రభుత్వం, పరిశ్రమ మరియు విద్యాసంస్థలకు చెందిన సంబంధిత నిపుణులు సంబంధిత రంగంపై ఉత్తమ అభ్యాసాలు మరియు తాజా చొరవను సమర్పించారు. వర్క్‌షాప్‌లో జరిగిన అంతర్దృష్టితో కూడిన చర్చలు పాల్గొన్న ప్రతినిధులచే ప్రశంసించబడ్డాయి. అనంతరం 'డిజిటల్ నైపుణ్యాలు' పేరుతో ప్రాధాన్యతా అంశంపై లోతైన చర్చ జరిగింది. పాల్గొన్న ప్రతినిధులు డిజిటల్ పరివర్తన, డిజిటల్ ఆప్టిమైజేషన్ మరియు భవిష్యత్ సంసిద్ధ సిబ్బంది ను రూపొందించడంలో డిజిటల్ నైపుణ్య విద్య యొక్క కీలక పాత్ర గురించి చర్చించారు. సమ్మిళిత అభివృద్ధి చర్చలో పునరుద్ఘాటించబడింది.

సమావేశం యొక్క మూడవ మరియు చివరి రోజున, జీ 20 సభ్యులు, అతిథి దేశాలు మరియు అంతర్జాతీయ సంస్థల మధ్య 'డిజిటల్ పౌర మౌలిక సదపాయాలు ' మరియు 'డిజిటల్ ఆర్థిక రంగంలో సైబర్ సెక్యూరిటీ వంటి ప్రాధాన్యతా రంగాలపై వివరణాత్మక చర్చలు జరిగాయి. జీ 20 యొక్క వివిధ వర్కింగ్ గ్రూప్‌లు మరియు సమాంతర ట్రాక్‌ల మధ్య సమన్వయాన్ని తీసుకురావడానికి, జీ పీ ఎఫ్ ఐ మరియు హెల్త్ డబ్ల్యూ జీ నుండి సంబంధిత లీడ్‌లు కూడా తమ పురోగతి మరియు డీ ఈ డబ్ల్యూ జీ తో అనుసంధానాన్ని అందించారు. ముఖ్యంగా ఆర్థిక సమ్మిళితం ఉ సార్వత్రిక డిజిటల్ ఆరోగ్యం కు సంబంధించిన డీ పీ ఐ ఇనిషియేటివ్‌లు మరియు భారతదేశంలో వాటి ప్రభావాలు హైలైట్ చేసారు. మూడు రోజుల పాటు, అనేక సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. భారతీయ సంస్కృతి, భారతీయ వంటకాలు, భారతీయ కళలు మరియు భారతదేశంలోని జానపద రూపాల గొప్పతనాన్ని ప్రతినిధులకు ప్రదర్శించారు. తదుపరి దశగా, జీ 20 సభ్యుల మధ్య ద్వైపాక్షిక మరియూ బహుళ–పార్శ్వ సమావేశాల శ్రేణి జరుగుతుంది. డిజిటల్ ఎకానమీ వర్కింగ్ గ్రూప్ యొక్క మూడవ సమావేశాన్ని 2023 జూన్ నెలలో మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించాలని నిర్ణయించారు.

# నవీన్‌నీ పరామర్శించిన అధికారులు



ఖమ్మం, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని కారేపల్లి మండలం చీమలపాడు గ్రామంలో ఈ నెల 12న జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సంకల్ప హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నవీన్ ను జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు యస్.వారియర్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభిలు గురువారం పరవర్శించారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు. బాధితుడికి అందుతున్న వైద్యం గురించి వైద్యులతో మాట్లాడారు. అధైర్య పడవద్దని, ప్రభుత్వ పరంగా అన్నివిధాల అదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ లాడఆర్డర్ సుభాష్ చంద్ర బోస్, టౌన్ ఏసీపీ గణేష్, ట్రాఫిక్ ఏసీపీ రామోజీ రమేష్, ఎస్బి ఏసీపీ ప్రసన్న కుమార్ ఉన్నారు.

# మే నెలాఖరునాటికి మనఊరు మనబడి చేపట్టిన పనులను పూర్తి చేయాలి

మెదక్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి):మనఊరు మనబడి క్రింద 30 లక్షల లోపు చేపట్టిన పనులను మే నెలాఖరునాటికి పూర్తి చేసేలా అంకితభావంతో పనిచేయాలని, అదేవిధంగా 30లక్షల పైబడి చేపట్టిన పనులను కూడా పరుగులు పెట్టించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి మండల వారీగా పాఠశాలల్లో వివిధ కాంపోనెంట్ ల క్రింద చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిధుల కొరత లేదని,చేసిన పనులకు సంబంధించి వెంటనే ఏం.బి.రికార్డు చేసి, ఎఫ్.టి.ఓ. పోర్టల్ లో నమోదు చేసి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్లకు అవగాహన , ధైర్యం, భరోసా కల్పించి వర్షాకాలం నాటికి వనులు పూర్తయ్యేలా కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. 30 లక్షల నుండి కోటి రూపాయల లోపు పనులకు టెండర్లు రాని ప్రాంతాలలో పాఠశాల నిర్వహణ కమిటీ లో తీర్మానం చేసి నామినేషన్ పద్ధతిన వెంటనే పనులు చేపట్టాలన్నారు. కోటి రూపాయల పైగా వనులుండి టెండర్లు రాని వాటికి సంబంధిత శాసనసభ్యుల సహకారంతో కాంట్రాక్టర్లు పాల్గొని పనులు చేపట్టేలా చూడాలని అన్నారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులు, ఎస్.ఏం.సి. చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, ఎంపిడిఓలు, ఎంపిఓలు ,కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి చేపట్టవలసిన పనులు, వాటి అంచనా, కాలవ్యవధి వంటి వివరాలు తెలిపి పనులు శరవేగంతో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎస్.ఏం.సి. సర్పంచులు ముందుకు రాని పక్షంలో తమ వద్ద ఉన్నకాంట్రాక్టర్ల ద్వారా వెంటనే పనులు మొదలు పెట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అదనపు తరగతి గదులు మంజూరు అయిన దగ్గర వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. సాంకేతిక అనుమతులు లేని వాటికి వెంటనే మంజూరి ఇవ్వాలని అన్నారు. నిర్మాణాలు పూర్తై రంగులు వేసిన వాటికి ఏం.బి. రికార్డు చేయాలని, ఇటీవల పూర్తైన నిర్మాణాలు జాబితాను పెయింటింగ్ ఏజెన్సీ కి అందజేసి ఒప్పందం ప్రకారం పెయింటింగ్ వేయించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అలసత్వం ప్రదర్శించిన పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, పంచాయత్ రాజ్ ఈ ఈ సత్యనారాయణ రెడ్డి, నీటిపారుదల ఈ ఈ శ్రీనివాస్ రావు, డిప్యూటీ ఈఈలు, ఏ.ఈ.లు, తదితరులు పాల్గొన్నారు.

## 1వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ఆరుగురు విద్యార్థిని, విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం

మెదక్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి):హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్ లో 2023–24 విద్యా సంవత్సరానికి 1వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ఆరుగురు విద్యార్థిని, విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఇంచార్జి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 4 సీట్లు బాలురకు, 2 సీట్లు బాలికలకు ఉన్నాయని ఆమె తెలిపారు. కాగా అభ్యర్థి 1 జనవరి 2017 నుండి 31 డిసెంబర్ 2017 లోపు జన్మించిన వారై ఉండాలని అన్నారు. ప్రవేశం పొందగోరే ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో దరఖాస్తు ఫారం నింపి రెండు ఫొటోలతో పాటు పుట్టిన తేదీ ధ్రువీకరణ, కుల,ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ఆమె సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామాలలో అయితే లక్షా యాభై వేలు, పట్టణాలలోని వారికి రెండు లక్షలు మించరాదని, దరఖాస్తు వెంట అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు జతపరచాలని విజయలక్ష్మి సూచించారు. దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్ లోని జిల్లా గిరిజన అభివృధి అధికారి కార్యాలయంలో ఉచితంగా పొంది ఈ నెల 29 సాయంత్రం 5 గంటల లోగా సంబంధిత ధ్రువపత్రాలు జతపరచి సమర్పించాలని ఆమె సూచించారు. మే 3 న ఉదయం 11 గంటలకు జిల్లా ఎంపిక కమిటీ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ పెద్దతి ద్వారా డ్రా తీసి ఎంపిక చేయబడునని ఆమె స్పష్టం చేశారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థిని,విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె సూచించారు.

# విద్యార్థులలో మానసిక ఉల్లాసానికి, విజ్ఞానానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల నందు స్పార్కిల్స్ క్యాంపు

మెదక్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి):విద్యార్థులలో మానసిక ఉల్లాసానికి, విజ్ఞానానికి ఈ నెల 22 నుండి మే 6 వరకు మెదక్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల నందు స్పార్కిల్స్ క్యాంపు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. గురువారం తన ఛాంబర్ లో స్పార్కిల్స్ క్యాంపుకు సంబందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 22 నుండి పక్షం రోజుల పాటు వెస్ట్రన్ డాన్స్,వేదిక్ మాథ్స్, మ్యూజిక్, లైఫ్ స్కిల్స్ మరియు స్పార్కిల్స్ పై క్యాంపు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఇందులో సాంఘిక సంక్షేమమే, గిరిజన సంక్షేమం, ఏకలవ్య పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానాచార్యులు వరలక్ష్మి, సీనియర్ వైస్ ప్రిన్సిపల్ ఉమారాణి తడిఆరులు పాల్గొన్నారు. .

# అవినాశ్‌కు వ్యతిరేకంగా సునీత సుప్రీంలో పిటీషన్ దాఖలు

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 20 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఎంపీ అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్‌కు వ్యతిరేకంగా సునీతారెడ్డి సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటీషన్‌లో అనేక కీలకాంశాలు పేర్కొన్నారు. అవినాశ్‌కు ముందస్తు బెయిల్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు మెరిట్ ప్రకారం లేవని, దర్యాప్తు పూర్తయిన తర్వాత విచారణ సమయంలో చేపట్టాల్సిన అంశాలను బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా తీసుకోవడం సరి అయింది కాదన్నారు. వివేకా హత్య కేసు దర్యాప్తుపై గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చినటువంటి ఆదేశాలకు విరుద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తు కీలక దశలో ఉందని.. న్యాయస్థానం ఆదేశాల మేరకు హత్య వెనుక ఉన్న విస్తృత కుట్ర కోణాన్ని చేధించే పనిలో సీబీఐ దర్యాప్తు జరుగుతోందన్నారు. ఎలాంటి నియంత్రణలు లేకుండా స్వేచ్ఛగా సీబీఐ దర్యాప్తు జరిపేలా అనుమతించాలని ఆమె కోరారు. ఈనెల 30వ తేదీ లోపు దర్యాప్తు పూర్తి చేయాలన్న అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల ప్రాధాన్యతను పట్టించుకోకుండానే తెలంగాణ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా దర్యాప్తు కీలక దశకు చేరుకున్న సమయంలో దర్యాప్తుకు అవరోధాలు కలిగించేలా తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఉన్నాయని సునీతా రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డిని ఈనెల 25వ తేదీదాకా అరెస్టు చేయవద్దని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించిన విషయం తెలిసిందే. అప్పటిదాకా ఆయన ప్రతి రోజూ సీబీఐ విచారణకు హాజరు కావాలంటూ స్పష్టం చేసింది. కాగా.. అవినాశ్ రెడ్డి మధ్యంతర బెయిల్‌కు వ్యతిరేకంగా వివేకా కుమార్తె వైఎస్ సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌ను సుప్రీం విచారణకు స్వీకరించింది. ఈ రోజు సీజేఐ ధర్మాసనం ముందు సునీత పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ప్రస్తావించారు. శుక్రవారం విచారణకు స్వీకరిస్తామని సీజేఐ తెలిపారు. దీంతో రేపు సునీత పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# కేసీఆర్ నాయకత్వం లో ముస్లింల అభివృద్ధికి పెద్దపీట...!

## - మైనారిటీలకు బట్టల పంపిణీ చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్



సంగారెడ్డి ఏప్రిల్ 20 (నేటి నిజం ప్రతినిధి) రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్కుల్ గ్రామంలోని మైనారిటీలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి కేసీఆర్ ముస్లింల అభివృద్ధి కి పలు విధాలుగా కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే పేద , ధనిక తేడా లేకుండా పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఉద్దేశ్యం తో బట్టలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణ,వెంకటేశ్,మురళీ, వెంకటేశ్, రాజ్ కుమార్,ఖదీర్,అజ్జు, సత్తార్, ఖాజామియా, ముస్లిం సోదరులు, యన్ ఎం ఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సంజీవని ఆరోగ్య రథం వాహనాన్ని ప్రారంభించిన చంద్రబాబు



అమరావతి, ఏప్రిల్ 20: కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల కోసం ఏర్పాటు చేసిన సంజీవిని వాహనాన్ని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ను అభినందించారు . యువ నాయకుడు నారా లోకేష్ స్ఫూర్తితో ఉదయగిరి నియోజకవర్గంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించుటకు సంజీవిని ఆరోగ్య రథం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రజలందరూ ఆ సంజీవిని ఆరోగ్య రథంలో ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో ఉచితంగా అందించే వైద్య సేవలను వివిధ రకాల వైద్య పరీక్షల గురించి కాకర్ల సురేష్ ను మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడిగి తెలుసుకున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, ఉదయగిరి కోటపై టిడిపి జెండా ఎగరవేయాలని సురేష్ కు సూచించారు

# రైతులతో మాట్లాడిన డీపీ అండ్ ఎఫ్ డబ్ల్యూ అదనపు కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష్ లిఖీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:భోపాల్ లోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ లోని ఐసీఏఆర్ లోని ప్రెసిషన్ ఫార్మింగ్ డెవలప్మెంట్ సెంటర్ (పీఎఫ్ డీసీ)ను వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష్ లిఖీ ఈరోజు సందర్శించారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న 22 పిడిఎఫ్ సీలు తమ సమీప గ్రామాలను దత్తత తీసుకుని బహిరంగ క్షేత్రం, రక్షిత సాగు సాంకేతిక పరిజ్ఞానం అంశాలపై రైతులకు మరింత అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

భోపాల్ పిఎఫ్ డిసి 3.8 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. దీనిలో సహజ వెలుతురు ప్రసరించే పాలీహౌస్ (02), కృత్రిమ వెలుతురూ ప్రసారం అయ్యే పాలీహౌస్ (02), కేబుల్ ,పోస్ట్ షేడ్ నెట్ (01), షేడ్ నెట్ గృహాలు (18 ), వ్యవసాయ కార్యక్రమాలు చెప్పడానికి సొరంగం తరహాలో నిర్మించిన సౌకర్యాలు ఉన్నాయి. ఈ నిర్మాణాలన్నీ ఏకీకృతంగా ఉంటాయి. ఈ సౌకర్యాలకు సూక్ష్మ బిందు నీటి పారుదల సౌకర్యం, సౌర శక్తితో అనుసంధానం చేశారు. ప్రదర్శనలు నిర్వహించడానికి రెండు హెక్టార్ల స్థలాన్ని కేంద్రంలో ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు.

ఓపెన్ ఫీల్డ్ , పాలీహౌస్ పరిస్థితుల్లో టమాటో, క్యాప్సికమ్ పంటల సాగు కోసం వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం అధ్యయనం, అభివృద్ధి కోసం కేంద్రం పరిశోధనలు నిర్వహిస్తోంది. అదేవిధంగా బహిరంగ పొలం, షేడ్ నెట్ పాలీహౌస్లలో టమాటో, క్యాప్సికమ్ పెరుగుదల అంచనా వేయడానికి పరిశోధన సాగిస్తోంది. మామిడి, జామ పంటలకు డ్రిప్ ఫెర్టిగేషన్ వ్యవస్థ ద్వారా నీరు సరఫరా చేయడం, మైక్రో స్ప్రింక్లర్ వ్యవస్థ ద్వారా బఠానీలు సాగు చేయడం అంశాలపై కేంద్రం లో పరిశోధన సాగుతోంది. అనుమతించిన పొడవున ఎన్ పి సి డ్రిప్పర్ ద్వారా నిర్దిష్ట ప్రమాణంలో నీరు విడుదల అవుతున్న తీరు పరీక్షించడం, వివిధ సూక్ష్మ సేద్యం వ్యవస్థల కింద వరి, గోధుమ పంట పెరుగుతున్న తీరు, విభిన్న రంగులతో నిర్మించిన షెడ్ల కింద పండ్లు ,కూరగాయల సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు గుర్తించడానికి కేంద్రం పరిశోధన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జామ, మామిడి, క్యాప్సికం, టమాటా, బఠానీ, పెసర, బంగాళాదుంపలు, ఉల్లి, శనగలు, గెర్బెరా పంటలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్రం అభివృద్ధి చేస్తోంది.

డ్రిప్ విధానం, నీరు ఆవిరి కాకుండా భూమిలో తేమ ఉండేలా చూసే మల్చింగ్ విధానం, పాలీహౌస్ కింద బిందు సేద్యం,మైక్రో స్ప్రింక్లర్, ఫ్లడ్ ఇరిగేషన్,ద్వారా నీరు సరఫరా చేసి పచ్చిక బయళ్లు, పళ్ళ తోటల పెంపకం వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్రం రైతుల కోసం ప్రదర్శిస్తోంది.

ఇంతవరకు సంస్థ 123 శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది. వీటిలో సుమారు 3,100 మంది రైతులు / రాష్ట్ర ఉద్యానవన అధికారులు పాల్గొన్నారు. 36 జాతీయ / ప్రాంతీయ స్థాయి వ్యవసాయ కార్యక్రమాలను కూడా సంస్థ నిర్వహించింది. పీఎఫ్ డీసీ వివిధ పద్ధతుల ద్వారా అందించిన పరిజ్ఞానం కారణంగా గత ఐదేళ్లలో పీఎఫ్ డీసీ, రాష్ట్ర ఉద్యాన శాఖ కృషితో బిందు సేద్యం విస్తీర్ణం 50000 హెక్టార్ల నుంచి 320000 హెక్టార్లకు పెరిగింది. ప్లాస్టిక్ మల్చింగ్ 2000 హెక్టార్ల నుంచి 25,000 హెక్టార్లకు, షేడ్ నెట్ గృహాలు 20 హెక్టార్ల నుంచి 240 హెక్టార్ల వరకు, పాలీహౌస్ లు1 హెక్టార్ నుంచి 210 హెక్టార్ల వరకు పెరిగాయి.

2023–24 సంవత్సరంలో సాంకేతిక మదింపు,శుద్ధి కోసం నాలుగు ప్రాజెక్టులను సంస్థ ప్రతిపాదించింది. రక్షిత నిర్మాణం కింద పోషకాలు అధికంగా ఉండే నీటితో నిలువు వ్యవసాయం, ఏడాది పొడవునా సాగు కోసం బై ఫేషియల్ సోలార్ గ్రీన్ హౌస్ వినియోగం, పాలీహౌస్ లో ఐఓటి / క్లౌడ్ ఆధారిత ఆటోమేషన్ వ్యవస్థ, షేడ్ నెట్ విధానంలో జరిగే కూరగాయల పంటల సాగులో బయోటిక్, అబయోటిక్ ఒత్తిళ్లను అధ్యయనం చేయడానికి ప్రాజెక్టులు చేపట్టాలని సంస్థ ప్రతిపాదించింది.

బిందు సేద్యంతో ప్లాస్టిక్ మల్చ్ కింద క్యారెట్, బిందు సేద్యంతో మల్చింగ్ కింద స్వీట్ కార్న్ సాగు, వివిధ మైక్రో ఇరిగేషన్ విధానంలో బఠానీలు, మల్చింగ్, పాలీహౌస్ లో టమోటా సాగుకు మైక్రో ఇరిగేషన్, పాలీహౌస్ లో దోసకాయ సాగు, మైక్రో ఇరిగేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టడానికి కూడా సంస్థ ప్రణాళిక రూపొందించింది.

# నిరుపేద ముస్లింలకు రూ.10 లక్షల సరుకుల పంపిణీ




కరీంనగర్, ఏప్రిల్ 20: రంజాన్ పవిత్రదినాన్ని పురస్కరించుకొని నిరుపేద ముస్లిం కుటుంబాలకు సురభి మెడికల్ కళాశాల యాజమాన్యం రూ.10 లక్షల రూపాయల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని ఎంబి గార్డెన్స్ లో ఇమామ్, మౌజంలతోపాటు ముస్లిం కుటుంబాలకు 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సురభి మెడికల్ కళాశాల ద్వారా రెండవ సంవత్సరం రంజాన్ మాసంలో నిరుపేదలకు సరుకులు పంపిణీ చేశారు. ఎలాంటి స్వార్థం లేకుండా 10 లక్షల రూపాయల సరుకులు పంపిణీ చేసిన సురభి రామచందర్ రావు, హరేందర్ రావు, మహేందర్ రావు, విక్యాత్ రావు లను ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఏ హమీద్, మసూద్, జావిద్, అలీముద్దీన్, హాది, సజ్జాద్, మతీన్, ఆదిల్, జమీల్, జావిద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

